# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 33, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) మంగళవారం - 22 - ఏప్రిల్ - 2025


## పరిపాలన అంటే అర్థమదే..

### ఈ పదేళ్లలో భారత్‌లో ఎన్నో మార్పులు జరిగాయి.



సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఓ కార్య క్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు

"సమగ్ర అభివృద్ధి అంటే దేశంలోని ఏ గ్రామం, కుటుంబం, ఒక్క పౌరుడు కూడా వెనకబడి ఉండకూడదని అర్థం

పథకాలు ప్రజలపై ఎంత ప్రభావం చూపుతాయనేది కీలకం

పలు కార్యక్రమాలను నడిపించే స్థాయికి మన దేశం చేరింది

యావత్ ప్రపంచ దృష్టి మన దేశంపై పడింది

దిల్లీ: తమ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు దేశ ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వ హించడం కాదని వ్యాఖ్యానించారు. రాబోయే అవ కాశాలను కూడా అంచనా వేయగలగాలని పేర్కొ న్నారు. సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా

## రేవంత్ రెడ్డిపై వ్యాఖ్యలు...

### హైకోర్టులో కేటీఆర్‌కు భారీ ఊరట



- రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారంటూ కేటీఆర్ ఆరోపణ
- కాంగ్రెస్, రేవంత్ రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేసు నమోదు
- ఆత్రం సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉట్నూరు పోలీసులు

హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట లభించింది. ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన మిగతా..2లో

## మోడీ టూర్ కు జగన్ కూ ఆహ్వానం ?

## మంత్రుల కమిటీ నిర్ణయాలు..!



అమరావతి : ఏపీలో అమరావతి రాజధాని నిర్మాణంపై కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. గతంలో జరిగిన తప్పిదాల్ని సరిదిద్దుకుని ఈసారి పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. ఇందులో భాగంగా అమరావతి రాజధాని పునర్ నిర్మాణ పనుల్ని త్వరలో ప్రారంభించబోతోంది. మిగతా..2లో

## ఎస్ఎల్బీసీ రెస్క్యూ ఆపరేషన్ పూర్తి..

### లభించని ఆరుగురు కార్మికుల ఆచూకీ!




శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం పైకప్పు కూలిన దుర్ఘటన జరిగి 58 రోజులైంది. గత 58 రోజులుగా సొరంగంలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. ప్రమాదం జరిగిన రోజు టన్నెల్ లోపల ఎనిమిది మంది చిక్కుకోగా, రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించిన బృందాలు రెండు మృతదేహాలను వెలికి తీయగలిగాయి.

మిగతా ఆరుగురి కోసం రెస్క్యూ ఆపరేషన్ నిరంతరంగా కొనసాగింది.

షిర్ జోన్లో తవ్వకాలు అసాధ్యం

58 రోజులపాటు తవ్వకాలు జరిపినప్పటికీ ఫలితం మాత్రం శూన్యంగా మారింది.

## విజయసాయి.. పొలిటికల్ రీఎంట్రీ!



- రావాలంటే వస్తా అంటూ.. వ్యాఖ్యలు
- బీజేపీలో కీ రోల్ దక్కనుందా?
- పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్

అమరావతి : సుదీర్ఘకాలం ఎంపీగా పనిచేసి, వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నంబర్ 2 అనిపించుకున్న, వైయస్ జగన్ కు అత్యంత సన్నిహితుడుగా పేరు తెచ్చుకున్న విజయసాయిరెడ్డి పొలిటికల్ రీఎంట్రీ ఇస్తున్నారా..?బీజేపీలోకి చేరుతున్నారా.? దీనిపై ఇప్పుడు ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్

## మరోసారి ఒకే వేదికను పంచుకున్న పవార్ బ్రదర్స్



దిల్లీ: : మహారాష్ట్రలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ , ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ మరోసారి ఒకే వేదికను పంచుకున్నారు. గత పదిహేను రోజుల్లో వారిద్దరూ కలిసి ఒకే వేదికపై కనిపించడం ఇది మూడోసారి. సోమవారం పూణేలోని సఖర్ సంకుల్ (షుగర్ కాంప్లెక్స్)లో జరిగిన సమావేశంలో శరద్ పవార్, అజిత్ పవార్ ఒకే వేదికను పంచుకున్నారు. మిగతా..2లో

## కెనడాలో శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయంపై దాడి



- సర్రేలోని ఆలయంపై దాడి
- శనివారం తెల్లవారుజామున ఇద్దరు దుండగుల విధ్వంసం
- ఆలయ ద్వారం, స్తంభాలు ధ్వంసం, ఖలిస్థానీ అనుకూల రాతలు
- ఆధారాలు దొరకకుండా సీసీటీవీ కెమెరాల చోరీ
- దాడి ఘటనపై భారత సంతతి కెనడా ఎంపీ ఆందోళన


న్యూఢిల్లీ : కెనడాలో హిందూ దేవాలయం మరోసారి దాడికి గురైంది. బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్‌లోని సర్రే నగరంలో గల ప్రఖ్యాత శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని కొందరు దుండగులు విధ్వంసం సృష్టించారు. ఈ ఘటన స్థానిక మిగతా..2లో

## పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత



- రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూత
- వాటికన్‌లోని తన నివాసంలో సోమవారం ఉదయం తుదిశ్వాస
- గత కొంతకాలంగా శ్వాసకోశ, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న పోప్
- మృతిని అధికారికంగా ధ్రువీకరించిన వాటికన్ వర్గాలు
- మరణానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ సందేశం ఇచ్చిన పోప్

న్యూఢిల్లీ : రోమన్ క్యాథలిక్ చర్చి అధిపతి, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది గౌరవించే క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూశారు. ఇటలీ



### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ లేఖ

- 'రోహిత్ వేముల' చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని లేఖ
- అంబేద్కర్, రోహిత్ వేముల ఎదుర్కొన్న వివక్ష మరెవరూ ఎదుర్కోకూడదన్న రాహుల్ గాంధీ
- రెండు రోజుల క్రితం కర్ణాటక ముఖ్యమంత్రికి కూడా లేఖ రాసిన రాహుల్ గాంధీ

## 30,000 ఎకరాల విస్తీర్ణంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం

- చాలా గర్వంగా ఉంది.. ఇది ఇలాగే కొనసాగిద్దాం: రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు
- "హైదరాబాద్‌కు రండి, మీ ఉత్పత్తులు ఇక్కడ తయారు చేయండి.
- భారత మార్కెట్‌తో పాటు ప్రపంచ దేశాలకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి"
- ఎగుమతుల కోసం సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్‌ను తెలంగాణలో ఏర్పాటు
- పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను వారితో సుదీర్ఘంగా చర్చించారు



హైదరాబాద్ : : జపాన్ లో జరిగిన వరల్డ్ ఎక్స్‌పో-2025 వేదికగా రాష్ట్ర పెట్టుబడి అవకాశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకాలో జరిగిన ప్రతిష్టాత్మక ఎక్స్‌పో-2025లో ముఖ్యమంత్రి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్

భారత మార్కెట్‌తో పాటు ప్రపంచ దేశాలకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి" అంటూ జపాన్ కంపెనీలను ఆహ్వానించారు. తెలంగాణ - జపాన్ మధ్య ఉన్న మంచి సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ, ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయానికి ఇది నాంది కావచ్చని అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఒసాకా, అంతర్జాతీయంగా మిగతా భాగస్వాములతో కలసి అద్భుత భవిష్యత్తును నిర్మిద్దామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

## 'ఊరికే అరవకు.. దమ్ముంటే అక్కడికి రా': కేటీఆర్‌కు ఈటల సవాల్



: బీఆర్ఎస్ , కాంగ్రెస్ ఒకరికొకరు ప్రతిపక్షం అని చెప్పుకుంటారు.. బీజేపీ వేగాన్ని తట్టుకోలేక మీదికి కొట్టుకుంటూ లోపల కలిసి ఉంటారని మిగతా..2లో

## వచ్చేది బీజేపీ ప్రభుత్వమే.. ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోగా.. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన పదా అధికారులు, మండల అధ్యక్షులు, మండల ఇంచార్జ్ ల సమావేశానికి జిల్లా సంఘటన సంరచణ మిగతా..2లో



## రికార్డు ఉష్ణోగ్రతలు, భారీ వర్షాలు

### - ఈ జిల్లాలకు తీవ్ర హెచ్చరిక..!!

తెలుగు రాష్ట్రాల్లో భిన్నమైన వాతావరణం కొనసాగుతోంది. ఉదయం సమయంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం సమయానికి ఈదురు గాలులతో వర్షాలు కురుస్తు న్నాయి. మిగతా..2లో

## తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల నుంచి ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ



- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు ఉత్తర్వులు జారీ
- తెలంగాణ నుంచి జస్టిస్ సురేందర్ మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ శ్రీసుధ కర్ణాటక హైకోర్టుకు బదిలీ
- ఆంధ్రప్రదేశ్ నుంచి జస్టిస్ మన్మథరావు కర్ణాటక హైకోర్టుకు బదిలీ
- అధికారికంగా ఖరారైన న్యాయమూర్తుల బదిలీలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులలో పనిచేస్తున్న ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ జరిగింది. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన మిగతా..2లో

## కెనడాలో శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయంపై దాడి

మొదటి పేజీ తరువాయి

హిందూ సమాజంలో ఆందోళన రేకెత్తించింది. ఆలయ అధికారుల కథనం ప్రకారం, శనివారం తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఖలిస్థానీ అనుకూల నినాదాలు చేస్తూ ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించారు. అనంతరం ఆలయ ప్రవేశ ద్వారం, కొన్ని స్తంభాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా, గోడలపై, స్తంభాలపై ఖలిస్థానీ ఉద్యమానికి మద్దతుగా రాతలు రాశారని పేర్కొన్నారు. దాడికి సంబంధించిన ఆధారాలు లభించకుండా అక్కడ అమర్చిన సీసీటీవీ కెమెరాలను కూడా దుండగులు అపహరించుకుపోయారని ఆలయ ప్రతినిధులు వివరించారు. భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచే ఈ ద్వేషపూరిత దాడిని, విధ్వంసాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటువంటి చర్యలు సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టి, శాంతికి భంగం కలిగిస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 19వ తేదీన కూడా కొందరు ఖలిస్థానీ జెండాలతో ఆలయం వద్ద నిరసన తెలిపినట్లు స్థానిక మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆలయంపై జరిగిన దాడి వెనుక భారత వ్యతిరేక శక్తుల ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించేందుకు ఆలయ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు.

అందరూ ఏకం కావాలని ఎంపీ చంద్ర ఆర్య ట్వీట్

కెనడాలో హిందూ ఆలయంపై దాడి పెరుగుతున్న ఖలిస్తానీ తీవ్రవాదానికి నిదర్శనమని భారత సంతతి కెనడా ఎంపీ చంద్ర ఆర్య ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా కెనడాలో హిందూ దేవాలయాలపై దాడులు కొనసాగుతున్నాయని సదరు ఎంపీ గుర్తు చేశారు. తాజాగా ఆలయంపై గీసిన రాతలు ఖలిస్తానీ తీవ్రవాదం పెరుగుతున్న ప్రభావాన్ని మరోసారి గుర్తుచేస్తున్నాయని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఖలిస్తానీ శక్తులు అత్యంత పక్కాగా వ్యవస్థీకృతంగా పనిచేస్తున్నాయని, వారికి భారీగా నిధులు సమకూరుతున్నాయని, అంతేకాకుండా గణనీయమైన రాజకీయ పలుకుబడి కూడా ఉందని ఎంపీ ఆరోపించారు. ఈ శక్తులు కెనడాలో నిర్భయంగా తమ ఆధిపత్యాన్ని చాటుకుంటున్నాయని అన్నారు. హిందూ సమాజం గొంతును అణచివేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖలిస్థాని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు.

## పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

వాటికన్‌లోని తన నివాసమైన కాసా శాంటా మార్టాలో ఆయన తుది శ్వాస విడిచినట్లు వాటికన్ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి.గత కొంతకాలంగా పోప్ ఫ్రాన్సిస్ శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యుమోనియా, కిడ్నీ సంబంధిత అనారోగ్యాలతో బాధపడుతున్నారు. ఈ కారణంగా ఫిబ్రవరిలో ఆసుపత్రిలో చేరి 38 రోజుల పాటు చికిత్స పొంది, గత నెలలోనే డిశ్చార్జ్ అయ్యారు. అర్జెంటీనాలో జన్మించిన ఆయన, దక్షిణ అమెరికా నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ప్రజల పోప్‌గా పేరుగాంచిన ఆయన, సామాజిక అంశాలపై తన గళం వినిపించేవారు.ఆశ్చర్యకరంగా, మరణించడానికి కొన్ని గంటల ముందు ఈస్టర్ పర్వదినాన సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో వేలాది మంది భక్తులకు ఆయన సందేశం ఇచ్చారు. అనారోగ్యం తర్వాత అంతమంది ప్రజల మధ్యకు రావడం అదే తొలిసారి. ఆయన మృతితో ప్రపంచవ్యాప్తంగా కేథలిక్ సమాజం విషాదంలో మునిగిపోయింది. కార్డినల్ ఫారెల్ ఆయన మృతిని ప్రకటిస్తూ, పోప్ ఫ్రాన్సిస్ జీవితం ప్రభువుకు, చర్చికి సేవ చేయడానికే అంకితమైందని పేర్కొన్నారు.

## 'ఊరికే అరవకు.. దమ్ముంటే అక్కడికి రా': కేటీఆర్‌కు ఈటల సవాల్

మొదటి పేజీ తరువాయి

ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఎమ్ఐఎమ్, , కాంగ్రెస్ అన్నీ కుటుంబ పార్టీలని.. బీజేపీ ఒక్కటే ప్రజాస్వామ్య పార్టీ అని చెప్పారు. చాయ్ అమ్ముకునే వ్యక్తిని బీజేపీ ప్రధాన మంత్రిని చేసిందని గుర్తుచేశారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా నిలబెడితే ఓడిపోతామని తెలిసి కూడా తట్టుకోలేక పోటీ పెట్టారని అన్నారు. దళిత బిడ్డ రామ్‌నాథ్ కోవింద్ మీద కూడా పోటీ పెట్టారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎమ్ఐఎమ్ పార్టీలన్నీ ఒకే తాను ముక్కలని చెప్పారు. ప్రస్తుతం బెంగాల్‌లో ఏం జరుగుతుందో అందరూ చూస్తున్నారు.. హైదరాబాద్ కూడా అలా మారాలంటే ఎమ్ఐఎమ్‌కు ఓటు వేయాలని కార్పొరేటర్లకు సూచించారు. హైదరాబాద్‌లో వక్ఫ్ పేరు మీద వేల కుటుంబాలు కన్నీళ్లు పెడుతున్నాయని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తాటాకు చప్పుళ్లకు భయపడేది కాదు బీజేపీ.. దేశహితం బీజేపీ సిద్ధాంతమని చెప్పారు. కార్పొరేటర్లారా చూస్తూ చూస్తూ బొందలపడకండి అని అన్నారు. 'బాంబుల మోతలు, ఎగిరిపడ్డ మాంసం ముద్దలు లేకుండా ఉండాలంటే బీజేపీకి మద్దతు ఇవ్వండి' అని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రత, ఆడబిడ్డలను కాపాడాలని కోరుతున్నట్లు చెప్పారు. బీజేపీ ఏ నిర్ణయం తీసుకున్నా అది దేశం కోసమే అని అన్నారు. పదేళ్ల బీజేపీ పాలన మీద అబిడ్స్ చౌరస్తాలో చర్చకు రావాలని కేటీఆర్ కు సవాల్ చేశారు. అనవసరంగా పదే పదే కేంద్రం నిధులు ఇవ్వడం లేదని గగ్గోలు పెట్టడం, ఫాల్స్ మాటలు మాట్లాడటం కాదు.. దమ్ముంటే చర్చకు చెబుతా అని ఛాలెంజ్ చేశారు. సీఎం, మంత్రులు ఇతర దేశాలకు వెళ్లినప్పుడల్లా వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చామని గొప్పలు చెప్పుకోవడమే కానీ.. ఇప్పటివరకు ఒక్కటి రాలేదని అన్నారు.

## వచ్చేది బీజేపీ ప్రభుత్వమే.. ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ప్రభారి అయ్యన్నగారి భూమయ్య ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల పేరిట పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేసిన ప్రజలు సభకు వెళ్లేందుకు సిద్ధంగా లేరు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పదిహేను నెలల్లోనే ప్రజల విశ్వాసం కోల్పోయింది అన్నారు. ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీ కి పట్టం కట్టడానికి సిద్దంగా ఉన్నారన్నారు. పేద ముస్లింలా సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని ఎన్ డీఏ కూటమి ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణ చేసింది అన్నారు. ఈనెల 26న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎన్ జీవో భవన్ లో వక్ఫ్ చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మేధావులు, ప్రజాస్వామిక వాదులు, డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు, ప్రజలు అవగాహన సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సిద్దిపేట పట్టణానికి రెండు కమిటీలు..

సిద్దిపేట పట్టణ పరిధి దృష్ట్యా టౌన్ 1, టౌన్ 2 రెండు బీజేపీ పట్టణ కమిటీలను వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. ఈనెల 25లోపు మండల, బూత్ కమిటీ నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక తర్వాత పూర్తి స్థాయిలో జిల్లా కమిటీల నియామకం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, అండగా ఉంటానని రఘునందన్ రావు అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపు రెడ్డి సురేందర్ రెడ్డి, చొప్పదండి విద్య సాగర్, కే రాంభూపాల్ రెడ్డి, సీనియర్ నాయకుడు వంగ రామచంద్రా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి వేణుగోపాల్, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ లేఖ

న్యూఢిల్లీ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. రాష్ట్రంలో యువత హత్యలను నిరోధించేందుకు 'రోహిత్ వేముల' చట్టాన్ని తీసుకురావాలని ఆ లేఖలో కోరారు. రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న యువకులు అర్ధాంతరంగా తమ జీవితాలను ముగించారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి ఆత్మహత్యలను నివారించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో యువత హత్యలను ఆపేందుకు ఈ కొత్త చట్టాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రోహిత్ వేములతో పాటు లక్షలాది మంది ఎదుర్కొన్న వివక్షను ఇతరులు ఎదుర్కోకుండా ఉండేందుకు 'రోహిత్ వేముల' చట్టాన్ని తీసుకురావాలని సూచించారు. రాహుల్ గాంధీ రెండు రోజుల క్రితం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు కూడా 'రోహిత్ వేముల' చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని లేఖ రాశారు.

## రేవంత్ రెడ్డిపై వ్యాఖ్యలు... హైకోర్టులో కేటీఆర్‌కు భారీ ఊరట

మొదటి పేజీ తరువాయి



ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఆత్రం సుగుణ ఫిర్యాదు మేరకు 2024 సెప్టెంబర్‌లో ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతోందని ఉట్నూరులో జరిగిన ఒక సభలో కేటీఆర్ ఆరోపణలు చేశారు. దేశంలో రాబోయే ఎన్నికల నిధుల కోసం మూసీ ప్రాజెక్టును రిజర్వ్ బ్యాంక్‌లా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కేటీఆర్ చేసిన ఆరోపణలపై ఆత్రం సుగుణ ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారంటూ ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయిని తగ్గించేలా నిరాధారమైన ఆరోపణలు చేసిన కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసును హైకోర్టు తాజాగా కొట్టివేసింది.

# 30,000 ఎకరాల విస్తీర్ణంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం

మొదటి పేజీ తరువాయి



వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమయ్యారు. పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను వారితో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, వరల్డ్ ఎక్స్‌పోలో భారతదేశం నుంచి మొట్టమొదటిగా పాల్గొన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, ఇది గర్వకారణమని తెలిపారు. తెలంగాణ –జపాన్ మధ్య ఉన్న చారిత్రక స్నేహ బంధాన్ని దీర్ఘకాలిక భాగస్వామ్యంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్తు ప్రణాళికలను రూపుదిద్దుకునే దిశగా కలిసి పనిచేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. సులభతర పారిశ్రామిక విధానం, స్థిరమైన పాలన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణకు పెట్టుబడులకు ఆకర్షణగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "హైదరాబాద్‌కు రండి, మీ ఉత్పత్తులు ఇక్కడ తయారు చేయండి. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచ దేశాలకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి" అంటూ జపాన్ కంపెనీలను ఆహ్వానించారు.

తెలంగాణ – జపాన్ మధ్య ఉన్న మంచి సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ, ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయానికి ఇది నాంది కావచ్చని అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఒసాకా, అంతర్జాతీయంగా మిగతా భాగస్వాములతో కలిసి అద్భుత భవిష్యత్తును నిర్మిద్దామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో 30,000 ఎకరాల విస్తీర్ణంలో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. ఇది ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీ కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఇందులో భాగంగా జపాన్‌కు చెందిన మరుబేని కార్పొరేషన్‌తో కలిసి ఒక ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల పొడవైన రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మధ్య ఉన్న జోన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. అంతర్జాతీయ ఎగుమతుల కోసం సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూసీ నది పునరుజ్జీవంలో భాగంగా నది పొడవునా 55 కిలోమీటర్ల అర్బన్ గ్రీన్ వే అభివృద్ధికి జపాన్ నగరాలైన టోక్యో, ఒసాకాల శ్రేష్ఠమైన అనుభవాల నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ ఇప్పటికే ఐటీ, బయోటెక్నాలజీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందని గుర్తుచేస్తూ,

ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో పెట్టుబడులకు అనువైన వాతావరణం రాష్ట్రంలో నెలకొన్నదని వివరించారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ, నైపుణ్యాల శిక్షణతో పాటు నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ'ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇది ఉపాధి, వ్యాపార అవకాశాలను రెట్టింపు చేస్తుందన్నారు.

## రికార్డు ఉష్ణోగ్రతలు, భారీ వర్షాలు – ఈ జిల్లాలకు తీవ్ర హెచ్చరిక..!!

మొదటి పేజీ తరువాయి

సీమ జిల్లాల్లో గాలిలో తేమశాతం తగ్గడంతో ప్రజలు ఠారెత్తిపోయారు. కోస్తాలో మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత, ఉక్కపోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. పలుచోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఇదే సమయంలో వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు చేసింది.

రికార్డు ఉష్ణోగ్రతలు : ఏపీలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. ఈ వేసవిలోనే తొలిసారి తిరుపతిలో 43.6 డిగ్రీల గరిష్ఠ అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే, నంద్యాల జిల్లా అవుకులో 42.6, తిరుపతి జిల్లా వెంకటగిరి, చిత్తూరు జిల్లా నగరి, ప్రకాశం జిల్లా పునుగోడులో 42.5, నెల్లూరు జిల్లా మునుబోలులో 42.4, పల్నాడు జిల్లా వినుకొండ, కడప జిల్లా ఉప్పలూరులో 42.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు విస్తరించిన ఉపరితలద్రోణి, ఎండ తీవ్రత ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. దీంతో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురిశాయి.

రానున్న అయిదు రోజులు : ఇదే సమయంలో వాతావరణ శాఖ బిగ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న ఐదు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా గంటకు 30 నుంచి 40 కి.మీ.ల వేగంతో బలమైన ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఎండ తీవ్రత కొనసాగి పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని అంచనాలు వెల్లడించింది. కాగా, సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని 31 మండలాల్లో తీవ్రంగా, 20 మండలాల్లో మోస్తరుగా వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అటు తెలంగాణలో మరో రెండు రోజులు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

వరుస వర్షాలు : ఉపరితల ద్రోణి ప్రభావం కారణంగా.. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమ,మంగళవారాల్లో ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ నగ రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదు రుగాలులతో కూడిన వర్షాలు కురిసాయి. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశాలున్నాయి. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా నల్లగొండ, వరంగల్, సూర్యాపేట, మహబూ బాబాద్, జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

## ఎస్ఎల్బీసీ రెస్క్యూ ఆపరేషన్ పూర్తి.. లభించని ఆరుగురు కార్మికుల ఆచూకీ!

మొదటి పేజీ తరువాయి

58 రోజుల పాటు సాగిన రెస్క్యూ ఆపరేషన్ లో ఆరుగురు కార్మికుల ఆచూకీ లభించలేదు. దీంతో రెస్క్యూ బృందాలు షిర్ జోన్లో తవ్వకాలు అసాధ్యమని చెబుతున్నాయి. దీనిపై టెక్నికల్ కమిటీ తర్వాత తుది నిర్ణయం తీసుకోనుంది. నోగో జోన్లో తవ్వకాలు తెలిపితే మృతదేహాలు దొరికే అవకాశం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రెస్క్యూ ఆపరేషన్ లో 12 సంస్థల బృందాలు

ఎనిమిది రోజులుగా సుదీర్ఘంగా జరిగిన రెస్క్యూ ఆపరేషన్ లో కేవలం రెండు మృతదేహాలను వెలికి తీయగలిగారు. మార్చి 9వ తేదీన గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని కనుగొన్నారు. ఇక మార్చి 22వ తేదీన ప్రాజెక్టు ఇంజనీర్ మనోజ్ కుమార్ మృతదేహాన్ని బయటకు తీసుకు రాగలిగారు. మొత్తం దేశంలోనే నైపుణ్యం కలిగిన 12 సంస్థల బృందాలు ప్రయత్నం చేసిన ఫలితం మాత్రం రాలేదు.

ఇప్పటివరకు దొరకని మరో ఆరుగురి ఆచూకీ

హైడ్రా, సింగరేణి, ఎన్డిఆర్ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, ర్యాట్ హోల్ మైనర్స్ ఇలా నిపుణులైన వారంతా రంగంలోకి దిగిన మరో ఆరుగురి ఆచూకీని ఇప్పటివరకు కనిపెట్టలేకపోయారు.

టన్నెల్ లోపల 281 మీటర్ల మేర పేరుకుపోయిన మట్టి, రాళ్లు, టన్నెల్ బోరింగ్ యంత్రం భాగాలను ఇప్పటికే బయటకు తరలించారు. ఇక టన్నెల్ లోపల 43 మీటర్లను డేంజర్ జోన్ గా గుర్తించి అక్కడకు ఎవరు వెళ్లకూడదని నిషేధ ప్రాంతంగా సూచించారు.

తెలంగాణాలో పెన్షన్ దారులకు శుభవార్త చెప్పిన రేవంత్ సర్కార్!

డేంజర్ జోన్ లో పనులు చెయ్యాలంటే మరింత సమయం

ఈ జోన్ కు సమీపంలోనే సహాయక చర్యలను నిర్వహించారు. అయితే డేంజర్ జోన్లో సహాయక చర్యలను నిర్వహించడం అంత ఈజీ కాదని రెస్క్యూ బృందాలు భావిస్తున్నాయి. ఈ జోన్ కు సమీపంలో భారీగా వస్తున్న నీళ్లను మోటార్లతో తోడుతున్నారు. అయితే ప్రస్తుతానికి రెస్క్యూ ఆపరేషన్ ముగిసినట్లేనని, డేంజర్ జోన్లో పనులు చేయాలంటే మరింత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

## మోడీ టూర్ కు జగన్ కూ ఆహ్వానం ? మంత్రుల కమిటీ నిర్ణయాలు..!

మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీని ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మే2న వచ్చేందుకు ప్రధాని మోడీ కూడా అంగీకరించారు. దీంతో మోడీ టూర్ విజయవంతం చేసందుకు చంద్రబాబు మంత్రుల కమిటీని నియమించారు. మే2న అమరావతిలో జరిగే ప్రధాని మోడీ టూర్ కు 5 లక్షల మంది వరకూ వస్తారని అంచనా వేస్తున్నారు. ఇందులో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూసేందుకు, ఇతర ఏర్పాట్ల కోసం నియమించిన మంత్రి వర్గ ఉపసంఘం ఇవాళ సమావేశం అయింది. ఇందులో మంత్రులు నారాయణ,పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్,సిఎస్ విజయానంద్, నోడల్ అధికారి వీర పాండ్యన్,ఇతర అధికారులు పాల్గొన్నారు. వీరు ప్రధాని టూర్ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం మంత్రుల భేటీ వివరాలను మున్సిపల్ మంత్రి నారాయణ వెల్లడించారు. ప్రధాని పర్యటన విజయవంతం చేసేందుకు మంత్రులు,అధికారులు చర్చించామని ఆయన తెలిపారు. మే రెండో తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని అమరావతి వస్తారన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ బహిరంగ సభ ఉంటుందన్నారు. అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రధాని ప్రారంభిస్తారన్నారు. సభా వేదిక వద్దకు చేరుకునేందుకు ఏడు రోడ్లు గుర్తించామన్నారు. ఇప్పటికే ఎవరెవరు ఏం చేయాలనే బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. మోడీ సభకు కనీసం 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నట్లు నారాయణ తెలిపారు.సభకు వచ్చే వారికి మంచి నీరు సరఫరా,పార్కింగ్,ఇతర వసతులు కల్పిస్తామన్నారు. అందరూ సమన్వయం చేసుకుని ప్రధాని పర్యటన విజయవంతం చేస్తామని తెలిపారు. అలాగే గతంలో మాదిరిగా ప్రతిపక్షాలను ఇప్పుడు కూడా ఆహ్వానిస్తామని ఆయన క్లారిటీ ఇచ్చారు. గతంలో ప్రధాని మోడీ అమరావతి రాజధాని శంఖుస్థాపనకు వచ్చినప్పుడు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆహ్వానించినా జగన్ హాజరుకాలేదు. ఈసారి అయినా వెళతారా లేదా చూడాల్సి ఉంది.

## విజయసాయి.. పొలిటికల్ రీఎంట్రీ!

మొదటి పేజీ తరువాయి

సిట్ విచారణకు హాజరైన విజయసాయిరెడ్డి విలేకరుల అడిగిన ప్రశ్నలకు పలు ఆసక్తికర సమాధానాలు ఇచ్చారు. తాను తిరిగి రాజకీయాల్లోకి రావాలంటే ఎవరి అనుమతి అవసరం లేదన్నారు. ప్రజలు కోరుకుంటే రాజకీయాల్లోకి మళ్లీ వస్తానంటూ ప్రకటించారు. వైసీపీ పట్ల తీవ్ర అసంతృప్తిగా ఉన్న విజయసాయిరెడ్డి బీజేపీ వైపు చూస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఆయన బీజేపీలో చేరుతున్నట్లు, ఆ పార్టీలో విజయసాయికి కీ రోల్ కూడా దక్కబోతోందని అంటున్నారు. ఈ ఏడాది జనవరిలో విజయసాయిరెడ్డి తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తాను రాజకీయాలను తప్పుకుంటున్నట్లు కూడా ప్రకటించారు. వ్యవసాయం చేసుకుంటానంటూ చెప్పారు. అయితే ఏపీలో లిక్కర్ కుంభకోణం కేసులో విజయసాయి సాక్షిగా ఉన్నారు. దీనికి సంబంధించి సిట్ ఎదుట ఆయన విచారణకు హాజరయ్యారు. ఆ సమయంలోనే ఆయన కొన్ని వ్యాఖ్యలు చేశారు. తాను తిరిగి రాజకీయాల్లోకి వస్తే అభ్యంతరం ఏంటంటూ ప్రశ్నించారు. విజయసాయి రెడ్డికి బీజేపీతో సత్సంబంధాలు ఉన్నాయి. వైసీపీ ఎంపీగా ఉన్న సమయంలో కూడా ఆయన ఆ పార్టీతో మంచి సంబంధాలను నడిపించారు. కమలం పార్టీపై ఎప్పుడూ విమర్శలు చేయలేదు. తను రాజకీయాల్లో రీఎంట్రీ ఇస్తాను అని ప్రకటించినప్పుడు.. ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడతారనే వార్త రాష్ట్ర రాజకీయాల్లో చక్కర్లు కొట్టింది. విజయసాయిరెడ్డి తో జగన్కు చెక్ పెట్టించాలని బీజేపీ భావిస్తున్నట్లు చెబుతున్నారు. బీజేపీలో చేరేందుకు విజయ సాయి రెడ్డి మంతనాలు కూడా సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆ పార్టీలో చేరితే విజయ్ సాయి రెడ్డి పాత్రపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. జాతీయస్థాయిలో ఉండేందుకు ఆయన ముగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాలను కూటమిలోని టీడీపీ, జనసేన పార్టీలు మౌనంగా పరిశీలిస్తున్నాయి

## మరోసారి ఒకే వేదికను పంచుకున్న పవార్ బ్రదర్స్

మొదటి పేజీ తరువాయి

వసంతదాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు కూడా హాజరయ్యారు. కాగా, ఈ సమావేశం తర్వాత అజిత్ పవార్ మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడానికి, భూసారాన్ని మెరుగుపరచడానికి, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడానికి ఏఐని ఉపయోగించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

రెండు వారాల్లో..

మరోవైపు శరద్ పవార్, అజిత్ పవార్ తిరిగి దగ్గరవుతున్నట్లుగా గత కొన్ని నెలలుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండు వారాల్లో మూడోసారి శరద్ పవార్‌తో వేదిక పంచుకోవడం గురించి అజిత్ పవార్‌ను మీడియా ప్రశ్నించింది. ఫ్యామిలీ గ్యాదరింగ్స్ లో సమావేశమవుతున్నాయమని.. దీన్ని వేరేగా రాజకీయ కోణంలో దీనిని అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. తన కుమారుడు జై నిశ్చితార్థం తర్వాత మరో కార్యక్రమంలో తామిద్దరం కలిసినట్లు చెప్పారు. ఈ సమావేశాలకు రాజకీయ ప్రాముఖ్యత లేదని అన్నారు. కొన్ని అంశాలు రాజకీయాలకు అతీతంగా ఉంటాయని అజిత్ అన్నారు.

## తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల నుంచి ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ

మొదటి పేజీ తరువాయి

సిఫార్సుల ఆధారంగా ఈ బదిలీలను ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల ప్రకారం, తెలంగాణ నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక న్యాయమూర్తి ఇతర రాష్ట్రాల హైకోర్టులకు బదిలీ అయ్యారు.తెలంగాణ హైకోర్టులో సేవలందిస్తున్న న్యాయమూర్తులలో జస్టిస్ కె. సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. మరో న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీసుధను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ కె. మన్మథరావును కూడా కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేశారు. ఈ బదిలీలకు సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం గతంలో సిఫార్సులు చేసింది. తాజాగా అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో ఈ ప్రక్రియ పూర్తయింది. బదిలీ అయిన న్యాయమూర్తులు త్వరలో తమ కొత్త బాధ్యతలను స్వీకరించే అవకాశం ఉంది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు హేమంత్ చందన్ గౌడ్‌ను మద్రాస్ హైకోర్టుకు, కృష్ణన్ న రాజన్‌ను కేరళకు, సంజయ్ గౌడ్‌ను గుజరాత్‌కు, దీక్షిత్ శ్రీకృష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేశారు.

## పరిపాలన అంటే అర్థమదే..

మొదటి పేజీ తరువాయి



ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "సమగ్ర అభివృద్ధి అంటే దేశంలోని ఏ గ్రామం, కుటుంబం, ఒక్క పౌరుడు కూడా వెనకబడి ఉండకూడదని అర్థం. ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదు. దేశ యువత, రైతులు, మహిళల ఆకాంక్షలు నెరవేర్చుతూ ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉపయోగపడతాయి. వారి అసాధారణ ఆకాంక్షలు నెరవేర్చడానికి సాధారణంగా కృషి చేస్తే సరిపోదు. అంతే వేగంతో ప్రభుత్వం పని చేయాల్సి ఉంటుంది" అని ప్రధాని పేర్కొన్నారు.

ఇది కీలకం..

"టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదు. కొత్త అవకాశాలు సృష్టించడం. పథకాలు ప్రజలపై ఎంత ప్రభావం చూపుతాయనేది కీలకం. దాని ఆధారంగా నాణ్యమైన పాలన కొనసాగించడం సాధ్యమవుతుంది. ఈ పదేళ్లలో భారత్‌లో ఎన్నో మార్పులు జరిగాయి. పాలన పారదర్శకత, ఆవిష్కరణ ఇలా ఎన్నో రంగాల్లో కొత్త మార్క్‌ను నెలకొల్పుతోంది" అని అన్నారు.

కారం పొడి చల్లి.. కట్టేసి.. మాజీ డీజీపీ హత్య కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి

"2023లో జీ20 భారత్ అతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే. నాడు 'జనభాగిదారి' విధానం ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చింది. యావత్ ప్రపంచ దృష్టి మన దేశంపై పడింది. కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే కాదు.. పలు కార్యక్రమాలను నడిపించే స్థాయికి మన దేశం చేరింది. అగ్రగామిగా నిలుస్తోంది. ఈసందర్భంగా సివిల్ సర్వెంట్లకు ఓ విజ్ఞప్తి చేయాలనుకుంటున్నా. పేదల సమస్యలను ఓపిగ్గా వినండి. వారితో సున్నితంగా వ్యవహరించండి. వారిని గౌరవించండి. పేదల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి" అని కోరారు.

## : ప్రశాంతంగా జరిగిన
## ఏపీ మోడల్ స్కూల్ తిమ్మారెడ్డి పాలెం ఆరవ తరగతి ప్రవేశపరీక్ష



లింగసముద్రం కే సురేష్ (శుభోదయం న్యూస్ ) :లింగసముద్రం ఏపీ మోడల్ స్కూల్ తిమ్మారెడ్డి పాలెంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరిగింది విద్యార్థినీ విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు పరీక్ష జరుగుతుండగా నెల్లూరు జిల్లా సర్వ శిక్ష అభియాన్ సీఎంవో కే పెంచలయ్య తనిఖీ చేయడం జరిగింది. ఆయన వెంట లింగసముద్రం ఎంఈఓ శివకుమార్ మరియు సీఆర్పీలు రాము, ఆశీర్వాదం ఉన్నారు.

## జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాలలో న్యూక్లియస్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): కళాశాల ప్రిన్సిపల్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ తమ న్యూక్లియస్ కళాశాలలో చదువుతున్న అనీషా తబస్సుమ్ అత్యధికంగా 99.37 పర్సంటైల్ సాధించింది అని, అదేవిధంగా మరో 7 మంది విద్యార్థులు 90కి పైగా పర్సంటైల్ సాధించారని తెలిపారు. లిఖిత్ 97.62, పర్సంటైల్, స్నేహలతా రెడ్డి 95.03 పర్సంటైల్, సాయి కిరణ్ రెడ్డి 94 పర్సంటైల్, కార్తిక 93.52పర్సంటైల్, జి మనోజ్ కుమార్ 92.69 పర్సంటైల్, తస్నీమ్ 91.87 పర్సంటైల్, పద్మ మీనాక్షి 91.61 పర్సంటైల్ సాధించారని తెలిపారు. వీరిలో కార్తిక 24, ఎస్. లికిత్ 1010, కె.సంతోష్ 8740, ఆల్ ఇండియా క్యాటగిరీ ర్యాంకులు సాధించినట్లు ప్రకటించారు. కళాశాల డైరెక్టర్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ.. న్యూ క్లియస్ కళాశాల నుంచి మొత్తం మీద 23 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ రాయడానికి అర్హత సాధించారని, ఈ విద్యార్థులందరూ అడ్వాన్స్ పరీక్ష రాయడానికి కళాశాలలో సిద్ధమవుతున్నట్టు తెలిపారు. నంద్యాల ప్రాంత ప్రజలకు సమీపంలో జేఈఈ, నీట్, మరియు సీ. ఏ. సంబంధిత నాణ్యమైన విద్యను అందుబాటులో ఉంచడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆదరించి, సహకరిస్తున్న విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, వివిధ పాఠశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, తమ కళాశాల అధ్యాపకులకు న్యూక్లియస్ కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

## ముక్కామల వంశి వర్ధంతి సందర్భంగా బి కే ఆర్ అమ్మ చిల్డ్రన్స్ హెూమ్ లో అన్నదాన కార్యక్రమం



గన్నవరం నియోజవర్గం ఇంచార్జ్ సురేష్ (శుభోదయం న్యూస్): గన్నవరం మండలం, బుద్ధవరంలోని బీకేఆర్ సేవా సంగం అమ్మ చిల్డ్రన్స్ ఆశ్రమంలో ఈ రోజు ముకమల వంశీ వర్ధంతి సందర్భంగా వారి సతిమణి ముకమల కల్పన ఆశ్రమం లోని చిన్నారులకు అలాగే పెద్దలకు మధ్యాహ్నం అన్నదానం సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కల్పన మాకు ఉన్న అత్యంత ఆప్తులలో ఒకరు గత 5 సంవత్సరాలనుండి కుటుంబం లో జరిగే కార్యక్రమాలు ఆశ్రమం లోని పిల్లల తోనే జరుపుకుంతారని, అమ్మ చిల్డ్రన్స్ ఆశ్రమం చైర్ పర్సన్ కానూరు శేష మాధవి స్థానిక విలేకరికి తెలియజేయడం జరిగింది. వంశీ గారి పవిత్ర ఆత్మ కు శాంతి కలగాలి అని మనసుపూర్తిగా కోరుకుంటూ వారి కుటుంభ సభ్యులు అంత సంతోషం గా ఉండాలని మనసారా ఆకాంశిస్తూ, బీ కే ఆ ర్ సేవా సంఘం,అమ్మ చీల్డ్రన్స్ హెూమ్స్ చైర్ పర్సన్ కానూరి శేష మాధవి వివరించండం జరిగింది.

## సింగన్నగూడెం గ్రామ వి.ఆర్.ఎ.గా నక్కా అనుకీర్తి నియామకం



గన్నవరం నియోజకవర్గం ఇంచార్జ్ సురేష్ (శుభోదయం న్యూస్):ఏప్రిల్ 21: బాపులపాడు మండలం, రంగన్నగూడెం శివారు సింగన్నగూడెం గ్రామ విలేజ్ రెవిన్యూ అసిస్టెంట్ (వి.ఆర్.ఎ.) గా పనిచేస్తూ నక్కా శివన్నారాయణ డిసెంబరు 2024 లో సర్వీసులో వుండగా అనారోగ్యంతో మరణించారు. గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శక సూత్రాల ప్రకారం కారుణ్య నియామకం క్రింద డిగ్రీ చదివిన ఆయన కుమార్తె నక్కా అనుకీర్తిని తాత్కాలిక ప్రాతిపదికన సింగన్నగూడెం వి.ఆర్.ఎ.గా నియమిస్తూ బాపులపాడు తహశీల్దారు ఇటీవల నియామక ఉత్తర్వులను ఇవ్వటం జరిగింది. ఈరోజు ఉదయం రంగన్నగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి, గ్రామ ప్రముఖులు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, గ్రామ ఉప సర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావు, గ్రామ పి.ఎ.సి.ఎస్. మాజీ అధ్యక్షులు తుమ్మల దశరథరామయ్య చేతుల మీదుగా ఈ నియామక పత్రాలను నక్కా అనుకీర్తికి అందజేయటం జరిగింది. ఈ సందర్భంగా నక్కా అనుకీర్తిని సింగన్నగూడెం వి.ఆర్.ఎ.గా నియమించటానికి సహకరించిన గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, బాపులపాడు తహశీల్దారు బి.మురళీకృష్ణకు రంగన్నగూడెం గ్రామ ప్రజా ప్రతినిధులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రంగన్నగూడెం గ్రామ ప్రముఖులు పల్లగాని వీరాంజనేయులు, కనుకుర్తి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతోపాటు మంచి చెడులను కూడా నేర్పించాలి గన్నవరం సిఐ శ్రీ బివి శివప్రసాద్...




గన్నవరం నియోజవర్గం ఇంచార్జ్ సురేష్ (శుభోదయం న్యూస్): ప్రస్తుతం ఉన్న సమాజంలో విద్యార్థినీ విద్యార్థులకు చదువుతోపాటు ఏది మంచి ఏది చెడు అనే విషయాలు కూడా వారికి నేర్పించాలని, నైతిక విలువలను వారికి తెలియజేయాలని గన్నవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ బి వి శివప్రసాద్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను కోరారు ఆయన ముస్తాబాద నవభారత్ హై స్కూల్ 23వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు ఎక్స్ట్రా కరీక్యులర్ యాక్టివిటీస్ లో కూడా పాల్గొనాలని, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. లయన్స్ జిల్లా ద్వితీయ వైస్ గవర్నర్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నవభారత్ హైస్కూల్ నందు చదువుతోపాటు సమాజ హితం కోసం అనేక కార్యక్రమాలు చేస్తారని దానికి ఉదాహరణ గత సంవత్సరం వరదలు సంభవించినప్పుడు తల్లిదండ్రుల సహాయంతో వరద ప్రభావిత ప్రాంతాలలోని విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం, ఆహార పొట్లాలు అందించడం మరియు పాడేరు గిరిజన ప్రాంతాలలో నూతన దుస్తులను గిరిజనులకు అందజేయడం వంటి ఎన్నో కార్యక్రమాలు ఉన్నాయి.వి సి ఎస్ అండ్ టి ఏ అధ్యక్షులు శ్రీ తాళ్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు వారి సర్వతో ముఖ అభివృద్ధికి పాటుపడే పాఠశాలలో చేర్పించాలని, వారిని ప్రేమతో చూడాలి కానీ గారాబం చేయరాదని తల్లిదండ్రులకు సూచించారు. కిడ్స్ కాన్వకేషన్ అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ విశేషంగా అలరించాయి.. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం, పరమానందయ్య శిష్యుల కథ స్కిట్ మరియు కాన్ తార నృత్యం అందర్నీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమామ్, గవర్నింగ్ బాడీ సభ్యులు శ్రీ ఆరుమళ్ళ మోహన్ రెడ్డి, సింగ్ నగర్ డివిజన్ అధ్యక్షులు శ్రీ గుండె స్లీబా, పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ జాకీర సూల్తానా, శ్రీ మేకల కోటేశ్వరావు శ్రీ టీ సాంబశివరావు, శ్రీమతి అరుమళ్ళ కనకదుర్గ, శ్రీమతి తాళ్లూరి లక్ష్మి, శ్రీమతి ఉషారాణి మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాయి టి నాయుడుపాలెం క్లస్టర్ హెచ్ఎం ఎన్ వి సుధారాణి






టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాయని మండల పరిధిలోని తూర్పు నాయుడుపాలెం క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ఎన్ వి సుధారాణి సోమవారం తెలిపారు. ఈ క్రమంలో తూర్పు నాయుడుపాలెం గ్రామంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## నూతన ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేసిన ఆళ్ళ సుబ్బమ్మ



(శుభోదయం న్యూస్) : త్రిపురాంతకం, ఏప్రిల్ 21 గుత్త చిన్న మూర్తయ్య శుభోదయం విలేఖరి: త్రిపురాంతకం ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేసిన ఆళ్ళ సుబ్బమ్మ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న మాజీమంత్రివర్యులు,వైసీపీ ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరావు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ నియోజకవర్గ వైసీపీ ప్రజా ప్రతినిధులు మండలంలోని వైఎస్ఆర్సీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు అన్ని గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో హాజరై వారికి అభినందనలు తెలిపారు.

## అవకాశాలకు హద్దు ఆవిష్కరణలతో కూడిన సృజనశీలతే..




ఉమ్మడి,అనంతపురం జిల్లా బ్యూరో “నరేంద్ర” (శుభోదయం న్యూస్) : స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి )నందు 21-04-2025 సోమవారం అర్థశాస్త్ర విభాగం,గణితశాస్త్రం విభాగం మరియు ఐ క్యూ ఏ సి విభాగం-ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కార్యక్రమాలలో భాగంగా ప్రపంచ సృజనాత్మకత మరియు ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా అంతర్జాల జాతీయ సదస్సు ఏర్పాటు చేయబడింది.ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ,భువనేశ్వర్ ఆచార్యులు డా నీమాయ్ మిశ్రా హాజరయ్యారు. వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచం నేడు సృజనశీలతకు ప్రాధాన్యతనిస్తుందని ఎవరైతే సృజనశీలతను కలిగి వుంటారో వారికి ఇబ్బడి మబ్బిడిగా అవకాశాలు వస్తాయన్నారు .సృజనశీలతతో కొత్త ఆవిష్కరణలకు నాంది పలికిన వారికి ప్రపంచం దాసోహమౌతుందన్నారు .అవకాశాలకు హద్దు ఆవిష్కరణలతో కూడిన సృజనశీలతే అని అన్నారు . నూతన ఆవిష్కరణలకు వయో భేదంతో పని లేదని మనసుతో సృజనశీలంగా చేసే ప్రయత్నమే సమాజాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తుందన్నారు. అనంతరం జంతుశాస్త్ర ,వృక్షశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులతో ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్స్ ప్రదర్శన ఏర్పాటు చేసారు .ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీ టి కృష్ణ,ఐ క్యూ ఏ సి కో ఆర్డినేటర్ శ్రీ కె భద్రాచలం,అకాడమిక్ కో ఆర్డినేటర్ డా వి యామిని,అర్ధ శాస్త్ర అధ్యాపకులు డా.సి హెచ్ ఉషారాణి,డా వి విజయలక్ష్మి ,గణిత శాస్త్ర అధ్యాపకులు శివకృష్ణ,రామలక్ష్మి,తెలుగు శాఖాధిపతి డా బూసి వెంకటస్వామి,జంతుశాస్త్ర విభాగాధిపతి డా.యం రామకృష్ణ ,పి.శ్రీనివాస రావు, సి హెచ్ రవికుమార్,జి డి శ్రీనివాసరావు ,వి రమేష్ ,దుర్గేశ్వరి ,ఉమ,దశరధ్ తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా కృష్ణాజిల్లా బాల బాలికల షూటింగ్ బాల్ జట్ల ఎంపికలు



గన్నవరం నియోజవర్గం ఇంచార్జ్ సురేష్ (శుభోదయం న్యూస్): కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ సబ్ జూనియర్ బాల బాలిక జట్ల ఎంపికలను సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించినట్లు జిల్లా షూటింగ్ బాల్ సంఘ కార్యదర్శి గోగులమూడి విజయ్ కుమార్ తెలిపారు. విజయవాడలోని గుణదలలో జరిగినటువంటి ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్లు చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో ఏప్రిల్ 26, 27 తేదీలలో జరగబోయే ఎనిమిదవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల షూటింగ్ బాల్ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తానని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పోకతోట శివకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. అనంతరం శివకృష్ణ మాట్లాడుతూ నేటి సమాజంలో తల్లిదండ్రులకు అవగాహన చాలా అవసరమని , ప్రతి ఒక్కరూ చదువును ర్యాంకులకు మాత్రమే ప్రాధాన్యతని స్తున్నారని, అలా కాకుండా ప్రతి విద్యార్థి సాంస్కృతిక కార్యక్రమాలలో ఆటపాట రాక కూడా పాల్గొనటం వలన సమగ్ర అభివృద్ధి జరిగి ఆరోగ్యంగా ఉండి అన్ని రంగాలలో రాణిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు చైతన్య, రత్నశేఖర్, అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారులు హనీత్ నాగ్, ఖమర్ బాషా, సీనియర్ క్రీడాకారులు శరన్ హేమంత్, యస్వంత్ నాగ్ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాస్టర్ ప్లాన్ నియోజకవర్గంలో వర్గ విభేదాలకు చెక్



దర్శి నియోజకవర్గం, శుభోదయం న్యూస్: దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అమలు చేసిన మాస్టర్ ప్లాన్ ఫలించింది. కొన్నేళ్లుగా నియోజకవర్గంలోని ఐదు మండలాలలో టిడిపి నాయకుల మధ్య ఉన్న వర్గ పోరుకు డాక్టర్ లక్ష్మి ఫుల్ స్టాప్ పెట్టింది. ప్రధానంగా కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు మండలాలలో టిడిపి నేతల మధ్య పెరిగిన వర్గ పోరుకు తెరదించింది. కొన్ని మండలాలలో రెండు, మూడు పార్టీ కార్యాలయాలను కూడా ఏర్పాటు చేసి వర్గ పోరును బహిరంగం చేసిన నేతలను చాక చక్యంగా డాక్టర్ లక్ష్మి ఓ దారిలోకి తీసుకువచ్చింది. ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో ఉన్న నియోజకవర్గం లోని ఐదు మండలాల తెలుగు తమ్ముళ్లను డాక్టర్ లక్ష్మీ చేపట్టిన ఆపరేషన్ దర్శి తో ఒకే మాట ఒకే బాట అనే విధంగా చేసింది. ఒకప్పుడు పార్టీ కార్యక్రమాలు అంటే ఎవరికి వారే ఏర్పాటు చేసుకున్న పార్టీ కార్యాలయాల్లో జరుపుకుంటూ నలుగురిలో నవ్వుల పాలు చేసే విధంగా జరిగాయి. ఇటీవల చేపడుతున్న అన్ని కార్యక్రమాలును అందరూ కలిపి ఒకే చోట జరుపుకునేలా డాక్టర్ లక్ష్మి తన సమర్థతను తెలుగుతమ్ములకు చవిచూపింది. ఓ వైపు పార్టీ కోసం కష్టపడ్డ నాయకులను కార్యకర్తలను కాపాడుకుంటూనే, మరోవైపు పార్టీ కార్యకర్తలకు ఇబ్బంది కలిగితే ఎంత దూరమైన వెళ్లేందుకు సిద్ధం అనే నమ్మకాన్ని పార్టీ శ్రేణులకు కలిగించింది. ఐదు మండలాలలో ఏ గ్రామంలోనైనా వర్గ విభేదాలు ఉన్నట్లు తన దృష్టికి వస్తే, వెంటనే సంబంధిత గ్రామాల నాయకులను పిలిపించి మాట్లాడడం, వారికి కావలసిన పనులు స్పాట్ లో చేసి పెట్టడం, వారి మధ్య ఉన్న విభేదాలకు గల కారణాలు తెలుసుకొని అంతటితో వర్గపోరుకు ఫుల్ స్టాప్ పెడుతుంది. నియోజకవర్గంలో తారాస్థాయిలో ఉన్న వర్గ విభేదాలు కాస్తా నేడు ఒకే మాట ఒకే బాట అనే చందంగా పార్టీ శ్రేణులు సైతం ఆశ్చర్యపడే రీతిలో డాక్టర్ లక్ష్మి చేపట్టిన ఆపరేషన్ దర్శి కార్యక్రమం దర్శి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసిందంటూ పొలిటికల్ వర్గాల్లో చర్చలు సాగుతున్నాయి. ఇదే తీరును కొనసాగిస్తే గొట్టిపాటి లక్ష్మీ చెప్తున్న బలమైన మాట ఓడిన చోటే గెలిచి తీరుతా అనేది నెరవేరడం ఖాయం అంటున్నాయి పొలిటికల్ వర్గాలు.

## పసుల సాంబయ్యకు నివాళులర్పించిన సోదా రామకృష్ణ



(శుభోదయం న్యూస్), పరకాల నియోజకవర్గం: పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ..పరకాల మున్సిపల్ పరిధిలోని 11వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుల అన్న స్వామి అన్నగారు పసుల సాంబయ్య గారు ఈరోజు అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్ పసుల రమేష్, ఏకు రాజు, నాయకులు కొయ్యడ చందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## వారెవ్వా లగ్గం కారట్లా బండారు శ్రీకాంత్ రావు ఫోటో నియత్ చాటుకున్న చాట్లపల్లి మాజీ ఎంపిటిసి




వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) ఏప్రిల్ 21: సోపతోళ్ళకు, సుట్టాలకు తెలిసినోళ్లకు పంచే లగ్గంకారట్లు దిన దినం కొత్త కొత్తగా కొట్టిస్తుండ్రు. అటువంటిదే మన జగదేపూర్ మండలం చాట్లపల్లి తాజా మాజీ ఎంపీటీసీ బురిగే నరసింహులు ముదిరాజ్ తన ఏకైక బిడ్డే సౌజన్య లగ్గం ఏప్రిల్ నెల 23 తారీకున జరుగుతుంది. ఆ లగ్గం కారట్ల ఒకవైపు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు ఆశీస్సులతో అని ఫోటో అచ్చు కొట్టించి అభిమానం సాటుకుండు మరోవైపు తారీకు పెళ్ళికొడుకు పేరు పెళ్లి పిల్ల పేరు పిలిచేటోళ్ల పేర్లు అచ్చు వేయించిండు. లగ్గం కారట్లు ఇయ్యానికి గజ్వేల్ మండలం జాలిగామ ఊరికి వచ్చి శ్రీకాంతరావుకు ఇచ్చి తప్పకుండా నా బిడ్డ సౌజన్య లగ్గంకు మరవకుండా వచ్చి పెండ్లి పిల్లను పెండ్లి పిల్లగాన్ని ఆశీర్వదించి అంబటాళ్లకు భోజనం చేసి పోవాలని కోరిండు. లగ్గం కారట్లు ఇచ్చేటప్పుడు గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు, వర్గల్ మండల కాంగ్రెస్ లీడర్లు తూముకుంట విష్ణువర్ధన్ రెడ్డి, భూంరెడ్డి హనుమంత్ రెడ్డి ఆత్మ కమిటీ డైరెక్టర్ సయ్యద్ బాబా ఉన్నారు

## వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాగానోళ్ల విజయ వైస్ చైర్మన్ గా కొడిత్యాల ప్రభాకర్ గుప్తా మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరణ



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) ఏప్రిల్ 22: సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యులను నియమిస్తూ వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్ గా వర్గల్ కు చెందిన బాగనోల్ల విజయ మోహన్, వైస్ చైర్మన్ గా బహిలింపూర్ కు చెందిన కోడిత్యాల ప్రభాకర్ గుప్త తో పాటు పలువురు సభ్యులను నియమిస్తూ సంబంధిత వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం వంటిమామిడి మార్కెట్ కమిటీ సెక్రటరీ రేవంత్ ఆధ్వర్యంలో చైర్మన్ గా బాగనోల్ల విజయ, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, పలువురు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించగా, అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వాళ్లకే పదవులు దక్కుతాయి అన్నారు నిదర్శనమే వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నారు మార్కెట్ పరిధిలోని మండలాల్లో వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడంతోపాటు, పెద్ద ఎత్తున కూరగాయల సాగుకు రైతులను ప్రోత్సహిస్తామన్నారు ముఖ్యంగా ప్రజా ప్రభుత్వ లక్ష్యం మేరకు రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి ఆర్థికంగా తోడ్పాటు అందించనున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా తమపై నమ్మకంతో వంటిమామిడి మార్కెట్ కమిటీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రిమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూ%శీ%కుంట నర్సారెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే త్వరలోనే వంటిమామిడి మార్కెట్ యార్డు ఆవరణలో రైతు సభ లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరుల సన్మాన కార్యక్రమం ఉంటుందని అన్నారు అనంతరం గజ్వేల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ బాధ్యులు శ్రీనివాస్, సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ను ఘనంగా సత్కరించారు.

## ఇటీవలే మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన.... బిఆర్ఎస్ పార్టీ మంగపేట మండల కమిటీ



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):మంగపేట మండలం జబ్బోనిగూడెం గ్రామానికి చెందిన కొప్పుల నారాయణ ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 6వేలరూపాయిల ఆర్థిక సహాయం అందజేసిన మండల పార్టీ అధ్యక్షులు కుడుముల లక్ష్మి నారాయణ, పిఏసిఎస్ చైర్మన్ తోట రమేష్, జిల్లా నాయకులు తాటి కృష్ణ, మల్లూర్ దేవస్థాన చైర్మన్ నూతిలకంటి ముకుందం, పిఏసిఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, నర్సింహసాగర్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, పార్టీ నాయకులు చిట్టీమల్ల సమ్మయ్య, చల్లగురుగుల తిరుపతి, గాదె శ్రీనివాస్ చారి, కోరేం నర్సింహులు, ఆలే జనార్ధన్, నాలి సూర్యనారాయణ, ఎండి అఫ్జల్ పాషా, యూత్ నాయకులు పిల్లలమర్రి వేణు, సోషల్ మీడియా వారియర్స్ గుడివాడ శ్రీహరి, పూజారి సతీష్, తదితరులు పాలుగోన్నారు.

## పదవి విమరణ శుభాకాంక్షలు తెలిపిన డిప్యూటీ జనరల్ సెక్రటరీ దేవలూటి శంకర్....




మార్కాపురం, శుభోదయం న్యూస్: గత 28 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా ఉండి ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యనందించి, వారి విద్యాభివృద్ధికి సుదీర్ఘకాలంగా కృషిచేసి ఎంతోమంది ఉపాధ్యాయుల మన్ననలు పొంది ఈరోజు పదవి వివరణ చేస్తున్న మాదాసు రంగనాయకులుకి శుభాకాంక్షలు. ఈరోజు మార్కాపురం బాయ్స్ హైస్కూల్ లో మాదాసు రంగనాయకులు కు పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాని జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ హెడ్మాస్టర్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కాపురం సబ్ -రీజిస్టర్ బాలయ్య విజిలెన్స్ డిపార్ట్మెంట్ హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు..విశిష్ట అతిథులుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జేఏసీ ఏపీ వైస్ చైర్మన్ : నల్లభోతుల శ్రీనివాసరావు దంపతులు శుభాకాంక్షలు తెలియజేశారు..చెన్నయ్య హెల్త్ డిపార్ట్మెంట్, లెక్చరర్ అల్లూరయ్య, యూటీఫ్ నాయకులు : సంజీవయ్య, శ్రీరాములు హాజరైనారు.ఎస్ టి యు ప్రకాశంజిల్లా అధ్యక్షులు : ఎర్రయ్య తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు రమేష్ బాబు అతిథిగా పాల్గొని రంగనాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.రిటైర్డ్ ఎస్సై సిహెచ్ పోలయ్య, శాయన్న, రంగస్వామి గౌడ్, హెచ్ఎం శంకరాచారి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ : శ్రీమతి అరుణ, ఉపాధ్యాయులు రజిని, భాస్కర్ గౌడ్, సుధాకర్ గౌడ్ పాల్గొని కార్యక్రమంను విజయవంతం చేశారు.నెల్లూరు జిల్లా నుండి “పూలే టీచర్స్ ఫెడరేషన్” ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు : అన్నం శ్రీనివాస్ లు, ప్రధాన కార్యదర్శి : వాసిలి శ్రీనివాస్ లు రంగనాయకులు కు శుభాకాంక్షలు తెలియజేసారు.యూ టీ ఫ్ రాష్ట్ర నాయకులు కావలి నుండి మాధవ, ఉపాధ్యాయు బృందం శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## చెనికల వారి నాగర్పమ్మ కొలుపుల్లో పాల్గొన్న దారపనేని



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామంలో తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీలు చెనికల పెదమాల కొండయ్య, శ్రీమతి వెంగమ్మ దంపతుల కుమారుడు నాగరాజు, కోడలు శివ జ్యోతి కుటుంబ సభ్యులు ఘనంగా సోమవారం నాగర్పమ్మ కొలుపులు నిర్వహించారు. ఈ కొలుపుల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని నాగరపమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొలుపుల కార్యక్రమం నిర్వహిస్తున్న చెనికల పెదమాల కొండయ్య కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కొలుపుల కార్యక్రమంలో చెనికల చిన్న మాల కొండయ్య కుటుంబ సభ్యులు, చెనికల మాధవరావు కుటుంబ సభ్యులు, చెనికల నాగరాజు దంపతులు,డాక్టర్ నాగార్జున, రూప శ్రీ దంపతులు, మహేష్ బాబు దంపతులు, శివరామకృష్ణ దంపతులు, నూతలపాటి వెంకటేశ్వర్లు, రామ, లక్ష్మణ్, చేనికల శ్రీనివాసులు కుటుంబ సభ్యులు,రవి, సురేషు, రమేషు, మనోజు,మానం మల్లికార్జున రావు అండ్ బ్రదర్స్, మానం వెంగళరావు, చెనికల కొండయ్య (కర్ణం) దంపతులు, మేకన బోయిన వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు, డబ్బు కొట్టు కృష్ణయ్య కుటుంబ సభ్యులు, చెనికల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, రవాణా చార్యులు కుటుంబ సభ్యులు, వెంకటయ్య కుటుంబ సభ్యులు, నాగయ్య కుటుంబ సభ్యులు, నాగినేని రమేష్ బాబు, గడిపూటి వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, శ్రీరాములు, మిరియం సుబ్బారాయుడు, గురువయ్య, యర సింగ్ రాయుడు, దారపనేని నరసింహారావు, నూతంగి నరసింహారావు అండ్ బ్రదర్స్, అద్దంకి వారి కుటుంబ సభ్యులు, ఇండ్ల చెరువు వారి కుటుంబ సభ్యులు, చెనికల వారి కుటుంబ సభ్యులు, మానం వారి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో కొలుపుల కార్యక్రమంలో పాల్గొన్నారు. కొలుపుల కార్యక్రమంలో విచ్చేసిన నాగర్పమ్మ భక్తులకు చెనికుల వారి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో ఘనంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## కోటపాటి వారి నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు.





పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్ రావు కుమార్తె కోటపాటి లక్ష్మీ శ్రీ - సునీల్ దంపతుల వేడుకలు విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ లో కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పామూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు, నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అడుసుమల్లీ ప్రభాకర్, బొల్ల నరసింహారావు, పువ్వాడి రామారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు (బెంగళూరు) టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## : ప్రభుత్వ హాస్పిటల్ డైరెక్టర్స్ ను ఘనంగా సన్మానించిన.... జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆకుపాటి....



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నామినేట్ పోస్టులు భాగంగా పామూరు పట్టణం నందు ప్రభుత్వ హాస్పిటల్ అభివృద్ధి నెంబర్ గా నర్సింగ్ సాంబయ్యను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర సింహారెడ్డి నియమించటం జరిగింది ఈ సందర్భంగా జిల్లా ఎంపిటిసి అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ తన కార్యాలయం నందు నర్సింగ్ సాంబయ్య మరియు ముబీనా మౌలాలి ఆదివారం ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఆకుపాటి మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న గంగసాని దంపతులు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ధర్మవరం గ్రామంలో ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్ రెడ్డి సోదరి నూతన గృహప్రవేశ వేడుకలు భాగంగా కుటుంబ సభ్యులు బంధువులతో కలసి పాల్గొన్న పామూరు మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి లక్ష్మీ దంపతులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కంబాలదిన్నె గ్రామంలో మన్నం రమణయ్య ఆధ్వర్యంలోఘనంగా చంద్రబాబునాయుడు గారి పుట్టినరోజు వేడుకల కంబాలదిన్నె గ్రామంలో రాష్ట్ర డైనమిక్ లీడర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి 75వ పుట్టినరోజు వేడుకలు కంబాలదిన్నె గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షులు మన్నం రమణయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగినాయి తొలిత ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి నిండు నేరేడులు ఆయుషు ప్రసాదించాలనిఆంజనేయస్వామిని గ్రామ ప్రజలు మొక్కినారు అనంతరం ఎన్టీఆర్ విగ్రహం దగ్గర కేక్ కటింగ్ కార్యక్రమం జరిగినది సీనియర్ నాయకులు గోళ్ళ భాస్కరరావు గ్రామ పార్టీ అధ్యక్షులు మన్నం రమణయ్ కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన అనంతరం అందరికీ స్వీట్లు పంచినారు ఈ కార్యక్రమంలో సనుమూరు వెంకటేశ్వర్లు గొల్ల కొండయ్య ఏలూరి నరసింహారావు ఎర్ర గొర్ల రమేష్ కోలా కృష్ణమూర్తి కొమ్మలపాటి రామయ్య గొల్ల రమణయ్య టీచర్ మెట్టం పెంచలయ్య గోళ్ళ వెంగబాబు పోక శ్రీనివాసులు ఒంగోలు లోకయ్య కొమ్మలపాటి మహేంద్ర కొమ్మలపాటి బాబు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఫ్రిజ్ బహుకరించిన.....

### ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ నర్సింగ్ సాంబయ్య ముబీన మౌలాలి



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి జన్మదిన సందర్భంగా పామూరు గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ సభ్యులు



నర్సింగ్ సాంబశివరావు ముబినా మౌలాలి కలిసి హాస్పిటల్ లో ఇంజక్షన్స్ స్టోర్ చేసుకోవడానికి గాను హాస్పటల్లో ఫ్రిజ్ లేదు అని డాక్టర్స్ చెప్పడంతో వెంటనే ఫ్రిజ్ తెప్పించి బహుకరించడం జరిగినది వారికి మండలతెలుగుదేశం పార్టీ తరపున శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేసిరు ఈ కార్యక్రమంలో ఫోర్ మెన్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, పట్టణ అధ్యక్షులు ఖాజా రంతుల్లా, బిజెపి నాయకులు కొండిశెట్టి రమణయ్య, బండ్ల నారాయణ, కొండ నరసింహులు, మెంటల్ నర్సింహారావు, గుత్తి మహేష్, షేక్ హాజీ గౌస్, సోమిశెట్టి శ్రీనివాసులు, ఫత్తు మస్తాన్, లక్ష్మీనారాయణ, ఆవుల రవణమ్మ, మద్దిశెట్టి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## కంచర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి 75వ జన్మదినోత్సవం సందర్భంగా రావిగుంటపల్లి గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చలివేంద్రం ఓపెనింగ్ మరియు అన్నదాన



కార్యక్రమం ప్రారంభించిన మన కనిగిరి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ శ్రీ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, బైరెడ్డి జయరాంరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, నర్సింగ్ సాంబయ్య, పువ్వాడి వెంకటేశ్వర్లు (బెంగళూరు),తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యూపీ సీఎంకు ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట తోలుబొమ్మను బహూకరించిన మంత్రి సత్య కుమార్ యాదవ్...





ఉమ్మడి, అంతపురం జిల్లా బ్యూరో “నరేంద్ర” (శుభోదయం న్యూస్): ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రసిద్ధిగాంచిన ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట తోలుబొమ్మను బహుకరించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా మంత్రివర్యులు సోమవారం యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించిన ధర్మవరం పట్టు వస్త్రాన్ని, నిమ్మలకుంట కళాకారులు రూపొందించిన శ్రీ కృష్ణుని తొలుబొమ్మను ఆయనకు బహూకరించి, ధర్మవరం పట్టు గురించి, నిమ్మలకుంట తోలుబొమ్మల విశిష్ఠత గురించి ఆయనకు వివరించారు. యోగి ఆదిత్యనాథ్ సత్యకుమార్ సాదరంగా ఆహ్వానించి మథుర శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ సంస్థాగత అంశాల గురించి చర్చించారు. తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోవాలని, అలాగే ధర్మవరం నియోజకవర్గాన్ని సందర్శించాలని సత్యకుమార్ యోగి ఆదిత్యనాథ్ కోరగా దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

## మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మంత్రి మారెప్ప.



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని మాజీ మంత్రివర్యులు మూలింటి మారెప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఇరువురు పలు రాజకీయ అంశాలపై చర్చించారు.వారితోపాటు నంద్యాల జిల్లా మాజీ లీగల్ సెల్ అధ్యక్షులు నందం బాబురావు ఉన్నారు.

## చల్లగుండ్ల శ్రీనివాస్ కి 6 లక్షలు చెక్కు అందజేత



పిడుగురాళ్ల టౌన్ రిపోర్టర్ శీనివాసరావు (శుభోదయం నూస్): గురజాల పట్టణంలోని శ్రీకాంత్ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ చల్లగుండ్ల శ్రీరామ్మూర్తి అనారోగ్య కారణంతో 02/08/2014 న స్వర్గస్తులయ్యారు. శ్రీకాంత్ నర్సింగ్ హోమ్ ద్వారా, చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత క్యాంపులు ద్వారా పల్నాటి ప్రజల గుండెల్లో శ్రీ రామ్మూర్తి చెరగని ముద్ర వేసుకున్నారు. డాక్టర్ చల్లగుండ్ల శ్రీ రామ్మూర్తి ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పిడుగురాళ్ల బ్రాంచ్ శాశ్వత సభ్యత్వం కలిగి ఉన్నారు, మరియు ఐ. ఎం. ఏ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ సభ్యత్వం కలిగి యున్నారు.గతంలో ఐ. ఎం. ఏ. నేషనల్ సోషల్ సెక్యూరిటీ స్కీమ్ ద్వారా 07/01/2025 న 11,37,080 /- చెక్ ను, అయన పెద్ద కుమారుడు చల్లగుండ్ల శ్రీనివాస్ గారికి అందించడం జరిగింది. మరల నేడు ఐ. ఎం. ఏ. ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా అక్షరాలా ఆరు లక్షల రూపాయల చెక్ ను (%=o%. 6,00,000/-) గురజాల లోని అయన స్వగృహం లో అయన పెద్ద కుమారుడు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ గారికి అందచేయడం జరిగింది. ఈ సమయంలో శ్రీరామ్మూర్తి గారి సతీమణి విజయలక్ష్మి గుంటూరులో ఉన్నారని తెలిసింది. చెక్ అందచేసిన వారిలో ఐ. ఎం. ఏ.పిడుగురాళ్ల, అధ్యక్షులు డాక్టర్ ధూళిపాళ్ళ భరత్ కుమార్ ట్రెసరేర్ డాక్టర్ ఆలా సాంబాశివ రావు ఉన్నారు. ఐ. ఎం. ఏ., పిడుగురాళ్ల అధ్యక్షులు, డాక్టర్ ధూళిపాళ్ళ భరత్ కుమార్.

## 2025 బెస్ట్ యంగ్ లీడర్ కాంటెస్ట్ లో విజేతగా నిలిచిన మునిగల సాంబులు..



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):మంగపేట మండలంలో మండల పరిసర ప్రాంత ప్రజలకు సేవనందించే మానవ సేవ యూత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2025 బెస్ట్ యంగ్ లీడర్ ఎవరు..? అనే కాంటెస్టు ఆన్లైన్ ఓటింగ్ ద్వారా నిర్వహించారు, ఈ కాంటెస్టో పాల్గొన్న యంగ్ లీడర్స్ లో అధిక ఓట్లు సాధించి ప్రథమ విజేతగా మునిగల సాంబులు నిలవగా, ద్వితీయ విజేతగా బసారికారి. నాగార్జున్ నిలిచారు, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి




మానవసేవ యూత్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ జై భీమ్ రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో యువ నాయకుల పాత్ర ఎంతవరకు ప్రజలను ప్రభావితం చేస్తుంది, ఎంతమంది ప్రజలు యువ నాయకుల్ని అభిమానిస్తున్నారు, యువకులు ఈ సమాజానికి ఎంత అవసరం వారి పాత్ర ఈ సమాజంలో ఎంత ముఖ్యమో ఈ కాంటెస్ట్ ద్వారా యువ నాయకుల ప్రాముఖ్యతను తెలియజేసే ముఖ్య ఉద్దేశంతో ఈ కాంటెస్టు నిర్వహించడం జరిగింది, పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు, వారందరికీ నా యొక్క ధన్యవాదాలు.

## జిల్లా మహాసభలను జయప్రదం చేయండి: ఏఐవైఎఫ్



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో అఖిల భారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ జిల్లా రెండో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్ష కార్యదర్శులు మారోజు నరసింహాచారి సుద్దాల సాయికుమార్ సంయుక్తంగా మాట్లాడుతూ ఏప్రిల్ 29న యాదగిరిగుట్టలో లక్కీ ఫంక్షన్ హాల్ లో జరుగు జిల్లా రెండోవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, దేశాన్ని క్యాన్సర్లా పట్టి పీడిస్తున్న అవినీతి లంచగొండి తనాన్ని రూపుమాపడానికి అవినీతి అంతం ఏఐవైఎఫ్ పంతంగా శపథం చేసి నిర్విరామ పోరాటాలను కొనసాగిస్తున్నది, విద్య, వైద్యం ఉపాధి హక్కుల సాధన కోసం పదివేల కిలోమీటర్లు సైకిళ్లపై రాష్ట్రం నలువైపుల జాతా నిర్వహించింది. ప్రాణాంతక గుట్కా పాన్ పరాగ్ ల, నిషేధం కోరుతూ గుట్కా తినకు గుటుక్కు మనకు అని ప్రచారోద్యమంతో పోరు సల్పింది, గుండాయిజం రౌడీయిజం నశించాలని,నైతిక విలువలు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఫ్యాక్షనిస్టులకు సీట్లు ఇవ్వొద్దు ఓట్లు వెయ్యొద్దు,అనే సామాజిక బాధ్యతను యువతకు గుర్తు చేస్తూ ప్రచారం ఆందోళనలు నిర్వహిస్తుందని అని అన్నారు.ఈ కార్యక్రమంలో బోడిగే సుదర్శన్ పవన్ కుమార్ నరేష్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంచి మనస్సు



ఒక మంచి బుద్ధి చాలు
అదే అసలైన సంపద.

మంచి బుద్ధి వున్నవాళ్లు
%సహాయం కోసం
ఎదురుచూడరు,
ఒక అడుగు వెనుక
వేయకుండా, రెండు
అడుగులు ముందే
వేస్తారు,
తమ దగ్గర వున్నది
రెండు చేతులు కాదు,
పది అనుకోని
ముందుకొస్తాయి.

ధనం ముందు మంచి మనస్సు
తాత్కాలికముగా గెలుస్తుంది కానీ
మంచి మనస్సుకు కొంత సమయం
పడుతుంది.
బంగారు గడియారాల వంక
చూడగలిగినా,
బంగారమైన హృదయాన్ని
తెలుసుకోగలిగేది కాలమే!

ధనవంతులని మనకు చూపించడానికి
వారికి ఎన్నో మార్గాలుంటాయి
వాహనాలు, బంగళాలు
కానీ “ఇవ్వడం” అనే గుణాన్ని
చూపించేందుకు

ప్రపంచం డబ్బుతో వెలగదు
ప్రేమతో, దయతో, మంచితనంతో
వెలుగుతుంది.
మంచి మనస్సు చాలు ఇతరలను
ఓడించాలంటే,
ఎవరైనా ఒక మంచి మనస్సుతో వుంటే
చాలు ముందుగా!
ఆందుకే ధనం కన్నా , దాన గుణం
గొప్పది
రచయిత : డాక్టర్ జి ఎన్ ఆర్ ప్రసాద్,
హైదరాబాద్.

శుభోదయం
WWW.SUBHODAYAMDAILY.COM
ప్రతి అక్షరం..ప్రజా సమరం......!



## ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి




బీర్కూర్,మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): బీర్కూర్ మండలం దామరాంచ గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి అనీల్ అనే వ్యక్తి మృతి చెందాడు.వివరాలు ఇలా ఉన్నాయి...బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన సింగని అనీల్ (37) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం అనీల్ ఒక పని నిమిత్తం బీర్కూర్ నుండి బాన్సువాడ కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో దామరాంచ గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో అనీల్ కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్త స్రావం జరిగింది. స్థానికులు గమనించి వెంటనే 108 లో బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ కు రిఫర్ చేశారు. నిజామాబాద్ లో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు.మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఝాన్సి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## సీలింగ్ అసిన్ పట్టా భూమికి కొత్త పాసుబుక్ మంజూరు చేయగలరని వినతి



అనంతగిరి ఏప్రిల్ 21. శుభోదయం న్యూస్: ప్రభుత్వ సీలింగ్ అసైన్డ్ పట్టా భూమికి కొత్త పాసుబుక్కుని మంజూరు చేయగలరని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ కు చాగంటి ఉపేంద్రమ్మ వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో భూభారతి అవగాహన సదస్సు హాజరైన కలెక్టర్ ను కలిసిన వినతి పత్రం అందజేసిన అనంతరం చాగంటి ఉపేంద్రమ్మ మాట్లాడుతూ 30



సంవత్సరాలుగా సీలింగ్ పట్టాను పొంది, భూమిని సేద్యం చేసుకుంటూ ఉన్నామని, పట్టా ఉన్నప్పటికీ కొత్త పాస్బుక్ రాకపోవడం వల్ల ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా లాంటి సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కలెక్టర్ చొరవ చూపి భూభారతి లో కొత్త పాసుబుక్కుని మంజూరు చేసి తమకు న్యాయం చేయాలని వినతి పత్రం ద్వారా కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఉపేంద్రమ్మ అందజేసిన వినతి పత్రంపై సత్వారమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారనీ తెలిపారు.

## స్వయంభూ బాల ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణం ఎన్నారై బెల్లంకొండ రవి సొంత ఖర్చులతో ఆలయ నిర్మాణం అభినందనలు తెలిపిన పాలవరం గ్రామస్తులు



అనంతగిరి ఏప్రిల్ 21 శుభోదయం న్యూస్: మండల పరిధిలోని పాలవరం గ్రామంలో 1000 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ స్వయంభు బాల ఆంజనేయ స్వామి పురాతన ఆలయాన్ని ఎన్నారై బెల్లంకొండ రవి సొంత ఖర్చులతో పునర్నిర్మాణం చేపట్టారు.ఈ సందర్భంగా సోమవారం ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు.ఎంతో మహిమ కలిగిన స్వయంభూ ఆంజనేయ దేవాలయం పునర్నిర్మాణం సుమారు 15 లక్షల పైచిలుకు అంచనాతో ఆలయ నిర్మాణం జరుగుతుంది.స్వయంభు హనుమంతుడే ఎన్నారై బెల్లంకొండ రవి రూపంలో వచ్చి తన ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నట్టు పలు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నారై బెల్లంకొండ రవి ఫౌండేషన్ పేరుతో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించి,ఎంతోమంది పేద కుటుంబాలకి వెలుగులు నింపారని,అనేక దేవాలయాల నిర్మాణాలకు,విగ్రహ ప్రతిష్ట లకు లక్షల రూపాయలు అందజేశారని గ్రామస్తులు కొనియాడారు. స్వయంభు బాల ఆంజనేయస్వామి ఆశీస్సులతో ఎన్నారై బెల్లంకొండ రవి ఉన్నత స్థాయిలో ఎదిగి అనేక సేవా కార్యక్రమాలు చేయాలని గ్రామస్తులు కాంక్షించారు.



# ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలి

ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో శ్రీనివాస్ (శుభోదయం న్యూస్)ఏప్రిల్ -20: ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి మారణకాండ (1981)జరిగి నలభై నాలుగేళ్లు అవుతున్న సందర్భంగా మధ్య భారతంలో ఆపరేషన్ కగార్ తో సాగుతున్న ఆదివాసుల హననానికి వ్యతిరేకంగా 20,ఏప్రిల్ 2025 నా కరీంనగర్, గణేష్ నగర్. సిపిఐ భవన్ బద్దం ఎల్లారెడ్డి భవన్ లో బహిరంగ సభ నిర్వహించారు.ఈ సభ ముడిమడుగుల మల్లన్న. గుమ్మడి కొమురయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా.పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణ రావు మాట్లాడుతూ. ఇంద్రవెల్లిలో జరిగిన మారణ కాండ దండకారణ్య ప్రాంతమంతా అనేక ఇంద్రవెల్లులు. వాకపల్లి లు జరుగుతున్నాయి.1996 పేసా చట్టం. 2006 అడవి హక్కుల చట్టాన్ని అమలు పరచకుండ నరమేధాన్ని కొనసాగిస్తూ ఆదివాసీల ఉద్యమాలకు నిశ్శబ్దం చేసి వనరులను కార్పొరేట్ లకు అందించడానికి చేస్తున్న మోడీ. అమిత్ షా చేస్తూన్న ఆర్థిక విధానాలను ఖండించారు. గత పదిహేను నెలల కాలంలో 400 మంది అమాయక ప్రజలను బూటకపు ఎన్ కౌంటర్ పేరిట చంపారని ఆరోపించారు. వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్. మాట్లాడుతూ





ఆదివాసీ అడవి ప్రాంతంలో సైన్యాన్ని దింపడం కోసం, వనరులను రవాణా చేయడం కోసం ఆరు లైన్ల 9 ఇంచుల రోడ్డును నిర్మించారని అన్నారు.ఇది ఆదివాసీలా అభివృద్ధి కి ఎలాంటి ఉపయోగం లేదని కనీసం వారికీ సైకిల్ లు కూడా లేవని అన్నారు. అంతేకాక మోహనరావ్. చలపతి. ఊర్మిళ. మిడ్కో లాంటి వారిని పట్టుకొని చంపారని అన్నారు. సిపిఐ. పార్టీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు. మాట్లాడుతూ అన్ని సమస్యలకు కమ్యూనిజమే ప్రత్యాన్యాయమని అన్నారు. ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా. బీజేపీ. ఆర్ ఎస్ ఎస్.ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని దానికి భారత కమ్యూనిస్ట్ పార్టీ.సిపిఐ మద్దతు ఉంటుందని అన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్. మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ తో తప్పనిసరిగా చర్చలు జరిపి ఉద్యమకారుల. ఆదివాసుల జీవించే హక్కులను కాపాడాలని. అంతేకాకుండా మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటించినందున కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి శాంతి చర్చలు జరిపి ఆదివాసుల జీవించే హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి. రైతంగా సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య. మహబూబ్ నగర్ జిల్లా సి ల్ సి.ప్రధాన కార్యదర్శి జక్కా బాలయ్య, ఇఫ్ట్.రాష్ట్ర అధ్యక్షులు కె. విశ్వనాధ్. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు రామిళ్ల బాపు. శ్రీపతి రాజగోపాల్. పుల్ల సుచరిత.ఎరుకల రాజన్న, పొన్నం రాజమల్లయ్య,నారా వినోద్, బొడ్డుపెల్లి రవి,బొంకురి లక్ష్మణ్ ఇఫ్ట్.రాష్ట్ర అధ్యక్షులు టి. రత్నకుమార్, సిపిఐఎంల్ న్యూ డెమోక్రసీ నాయకులు చింతా భూమేశ్వర్. పోరెడ్డి వెంకట్ రెడ్డి. దుర్గం నగేష్,మాస్ లైన్ ఉమ్మడి జిల్లా నాయకులు జిందం ప్రసాద్. రాసా భూమయ్య. రైతు కూలి సంఘం నాయకులు ఎల్. భీమన్నా, పీడీస్ యు.జిల్లా కన్వీనర్ అంగడి కుమార్ భారత్ బచావో నాయకులు నారాయణ. పులిపాక రవీందర్,డీటీఫ్ నాయకులు కరెంగుల సరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# : రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూభారతి జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్



అనంతగిరి ఏప్రిల్ 21. శుభోదయం న్యూస్ : సోమవారం మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో గల గోధాంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం -2025 పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరయి మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూముల పై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు.ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా దొరుకుతుందని, జూన్ 2 నుండి ఆన్లైన్లో భూభారతి చట్టం పోర్టల్ పనిచేస్తుందని తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏదైనా సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేస్తే నిర్దేశించిన సమయంలో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.ధరణిలో వ్యవసాయ సబ్ డివిజన్ పై ఎలాంటి ప్రస్తావన లేదని భూభారతి చట్టంలో సబ్ డివిజన్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు.ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న భూభారతి చట్టం లోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఇకపై బ్యాంకు రుణాలకు వెళ్ళినప్పుడు భూములకు సంబంధించిన కాగితాలను సమర్పించాల్సిన అవసరం లేదని, భూభారతి పోర్టల్ లో నమోదైన రికార్డుల ఆధారంగానే

అంశాలను రైతులు ఇతర రైతులతో పంచుకోవాలని, చట్టంపై అందరికీ పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.భూభారతి చట్టంలోని అంశాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఆర్డిఓ కార్యాలయాల్లో ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇక్కడ ఫిర్యాదులను సమర్పించి పరిష్కరించుకోవచ్చని, ఒకవేళ రైతులకు ఎవరికైనా న్యాయసహాయం అవసరమైతే ఉచిత న్యాయ సహాయాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ తెలిపారు.భూ భారతి చట్టం ద్వారా భూములకు సంబంధించిన అవినీతిని అరికట్టి, రెవెన్యూ శాఖను బలోపేతం చేయడానికి జరిగేలా భూ వివాదాలు లేని చట్టంగా ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు.భూములకు సంబంధించిన అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం దొరికిందని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో ఇలాంటి ఆకాశము లేదని తెలిపారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఎంతోమంది మేధావులు, అధికారులు భూభారతి చట్టానికి


బ్యాంకు రుణాలు ఇస్తారని తెలిపారు. భూభారతి చట్టంలోని ముఖ్యమైన అంశాలను వివరిస్తూ భూభారతి చట్టంలో మ్యుటేషన్లు ఆటోమేటిక్ గా అవుతాయని,30 రోజుల్లో మ్యుటేషన్ కాకపోతే 31వ రోజు ఆటోమెటిగ్గా మ్యుటేషన్ జరుగుతుందన్నారు.భూ భారతి

రూపకల్పన చేయడం జరిగిందన్నారు.రెవెన్యూ డివిజనల్ అధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ భూభారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలపై రైతులకు అవగాహన కల్పించారు.గతంలో ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని,ఇప్పుడు రికార్డుల నిర్వహణ ఉంటుందని,భూమి కలిగిన ప్రతి రైతుకు ఆధార్ కార్డు లాగే భూధార్ కార్డు ఇవ్వడం జరుగుతుందని,గతంలో ఏదైనా సమస్య



పరిష్కారం కాకుంటే అప్పిల్ వ్యవస్థ లేదని,ఇప్పుడు మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని,ప్రతి అంశం భూభారతి పోర్టల్ ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన పరిశీలించుకోవచ్చు అని వివరాలను తెలిపారు.ఈ కార్యక్రమంలో అదేవిధంగా స్థానిక తహసీల్దార్ హిమబిందు,మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డిప్యూటీ తాసిల్దార్ శ్రీధర్,సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముసుకు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు,జెడ్పిటిసి కొనతం ఉమా శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బుర్ర పుల్లారెడ్డి, గునుకుల గోపాల్ రెడ్డి,ఈదుల కృష్ణయ్య, గుర్రం వెంకటరెడ్డి,బానోతు బాబు నాయక్ ,దేగ కొండయ్య, బుర్ర నర్సిరెడ్డి గురుకుల స్వరూప వెంకట్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులను ఎంపిక చేయడానికి ఇంటర్వ్యూలు రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ




గోదావరిఖని టౌన్ రిపోర్టర్ - సురేష్, (శుభోదయం న్యూస్) : రాజీవ్ యువ వికాసం పథకానికి సంబందించి అర్హులను ఎంపిక చేయడానికి ధరఖాస్తుదారులకు బుధవారం నుండి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) , రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణ శ్రీ తెలిపారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయా బ్యాంకు శాఖల అధికారులు నిర్వహించే ఇంటర్వ్యూలకు ధరఖాస్తు దారులు తాము ధరఖాస్తులో సూచించిన బ్యాంకుల వారీగా ఈ దిగువ చూపబడిన షెడ్యూలు ప్రకారం హాజరు కావాలని కోరారు.ఏప్రిల్ 23 ఉ.10.00 గం :స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఎన్ టి పి సి శాఖ, రామగుండం శాఖ , ఏప్రిల్ 24 ఉ.10.00 గం : స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ , ఫెర్టిలైజర్ సిటీ (మునిసిపల్ ఆఫీస్ కాంప్లెక్స్) శాఖ , జల్లారం శాఖ. ఏప్రిల్ 25, ఉ.10.00 గం : స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ . ఎస్ సి సి ఎల్ శాఖ , విట్టల్ నగర్ శాఖ , లక్ష్మీ నగర్ శాఖ ఏప్రిల్ 28 ఉ. 10.00 గం : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ , గోదావరిఖని శాఖ,మేడిపల్లి లింగాపురం శాఖ, 8 ఇంక్ లైన్ కాలనీ శాఖ, ఏప్రిల్ 29 ఉ. 10.00 గం : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాబ్యాంక్, మార్కండేయ కాలనీ శాఖ, రమేష్ నగర్ శాఖ.ఏప్రిల్ 30 ఉ. 10.00 గం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ , గోదావరిఖని శాఖ, మేడిపల్లి చౌరస్తా శాఖ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జ్యోతి నగర్ శాఖ హెచ్ డి ఎఫ్ సి , రామగుండం శాఖ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ,గోదావరిఖని శాఖ, మిగిలిన అన్ని ఇతర బ్యాంకు శాఖలు. కావున రాజీవ్ యువ వికాసం పథకానికి ధరఖాస్తు చేసుకున్న వారు ఒరిజినల్ దృవీకరణ పత్రాలు ఆధార్ , పాన్ కార్డ్ , బ్యాంక్ పాస్ బుక్ , కుల దృవీకరణ పత్రం , రేషన్ కార్డు లేదా ఆదాయ దృవీకరణ పత్రం మొదలైనవి వెంట తీసుకొనివచ్చి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

## ఘనంగా మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ మహిళా నాయకురాలు ముద్దసాని సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో




గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) : మన మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్ జన్మదిన సందర్భంగా రామగుండం మాజీ శాసనసభ్యులు కోరు కంటి చందర్ ఆదేశాల మేరకు మహిళా నాయకురాలు ముద్దసాని సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ఆఫీసులో ఘనంగా ఈశ్వర్ అన్న జన్మదిన వేడుకలు జరిగినాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కవిత సరోజిని, కవంపల్లి కనక లక్ష్మి, ఆరే లక్ష్మి, తిరుమల బి ఆర్ ఎస్ యువజన విద్యార్థి నాయకులు ఇరుగు రాళ్ల శ్రావణ్, సాయికుమార్ అలియాస్ చింటూ, బిఆర్ఎస్ నాయకులు బుర్రి వెంకటేష్, కోడి రామకృష్ణ, కొర్రి ఓదెలు, సట్టు శ్రీనివాస్, అవునూరి వెంకటేష్, కడమండ శ్రీహరి, బచ్చలి రాములు, కర్రావుల రామరాజు, గుడికందుల సతీష్,మీర్ ఫయాజ్, బి ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అలా చేయకపోతే.. నష్టపోయేది రైతులే: తుమ్మల



నిజామాబాద్: తెలంగాణకు పసుపుపారాణి లాంటిది నిజామాబాద్ జిల్లా అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నిజామాబాద్‌లో రైతు మహోత్సవాన్ని ఆయన మరో మంత్రి జూపల్లితో కలిసి ప్రారంభించారు. పసుపు పంటకు మద్ధతు వస్తేనే.. పసుపురైతు తలెత్తుకుని ఉండగలడు అని పేర్కొన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణకు సాటివచ్చే రాష్ట్రం మరొకటి లేదని.. రైతులకు రూ.2 లక్షలు వరకు ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. కొన్ని కారణాల వల్ల రైతు భరోసా అర్ధంతరంగా నిలిచిపోయిందని అన్నారు. మిగిలిన రైతులకు కూడా త్వరలో రైతుభరోసా నిధులు ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చిన మిగతా అన్ని పథకాలను నిలిపివేసిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు వ్యవసాయ మంత్ర పరికరాలను ఇవ్వలేదని.. ఈ ప్రభుత్వం ఇస్తోందని అన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని.. నష్టాలు వస్తున్నప్పటికీ.. అన్ని పంటలను మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం కొనగోలు చేస్తోందని తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు చాలా పెరగాల్సి ఉంది ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకున్నది పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేయకపోతే రైతులే నష్టపోయే పరిస్థితి వస్తుంది తెలిపారు. 4 ఎకరాల వరి సాగుతో వచ్చే లాభం ఎకరం అయిల్‌పామ్ తోటలో వస్తుందని.. దేవరకొండలో ఒక రైతు కుంకుడుకాయల సాగుతో రూ.6 లక్షలు సంపాదిస్తున్నారని వివరించారు.;

## ఆ రెండు సెక్యూలర్ పార్టీలు ఎలా అవుతాయి: కిషన్ రెడ్డి



హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పోటీచేయకుండా మజ్లిస్‌కు అండగా ఉంటున్నాయని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఎన్నికైన కార్పొరేటర్లను ఓటువేయకుండా బిఆర్ఎస్ బెదిరిస్తోందని దుయ్యబట్టారు. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది ఓటేసి గెలిపించిన ప్రజలను అవమానించడమేనని చురకలంటించారు. ఎంఐఎం కోసం ప్రజలు బిఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటేయలేదని ధ్వజమెత్తారు. మతోన్మాద మజ్లిస్‌కు మద్దతు ఇస్తున్న ఈ రెండు పార్టీలు సెక్యూలర్ పార్టీలు ఎలా అవుతాయని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్ ఎంఎల్ సి ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మజ్లిస్ తో కాంగ్రెస్ కుమ్మక్కైందని, బిఆర్ఎస్, మజ్లిస్, కాంగ్రెస్ పార్టీల నిజ స్వరూపం బయటపెట్టాలనే బిజెపి పోటీ చేస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లపై మాజీ సిఎం కెసిఆర్ కు నమ్మకం లేకపోవడంతోనే ఓటింగ్ కు వెళ్లొద్దని చెబుతున్నారని మండిపడ్డారు.

## వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై ఏప్రిల్ 22న జెపిసి సమావేశం



న్యూఢిల్లీ : వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం తర్వాత కేంద్ర ప్రభుత్వం వెంటనే వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై దృష్టి పెట్టింది. వన్ నేషన్, వన్ ఎలక్షన్ జాయింట్ పార్లమెంటరీ కమిటి (జెపిసి) ఏప్రిల్ 22న తేదీన తొలిసారి సమావేశం కానుంది. ఈ సమావేశం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు జరగనుంది. ఈ సమావేశంలో మొదటి సెషన్‌లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ గుప్తాతో, జమ్మూ కాశ్మీర్ హైకోర్టు మాజీ ప్రదాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎన్ ఝాతో ఈ కమిటీ చర్చలు జరపనుంది. రెండవ సెషన్‌లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, 21వ లా కమిషన్ ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ బిఎస్ చౌహాన్ పాల్గొననున్నారు. చివరి సెషన్‌లో రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ పాల్గొననున్నారని జెపిసి ఛైర్మన్ పిబి చౌదరి వెల్లడించారు. కాగా, వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై జెపిసి ఛైర్మన్ పిబి చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. 'జెపిసి కమిటీ రెండు విషయాలపై నిర్ణయాలు తీసుకుంది. దీనికి సంబంధించిన అడ్వర్టైజ్‌మెంట్ అన్ని భాషల్లో ప్రింట్ అవుతుంది. దీంతో అందరూ అభిప్రాయాలు పంచుకోవచ్చు. రెండవది దీనికోసం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తేనున్నాం. ప్రస్తుతం దీన్ని సెక్రటరీ జనరల్ పరిశీలిస్తున్నారు. సూచనలు పంపితే.. వెబ్‌సైట్ క్రాష్ కాకుండా చూసుకోవడానికి టెక్నాలజీ అభివృద్ధికి మరికొంత సమయం పడుతుంది. క్యూఆర్ కోడ్ సౌకర్యంతో వెబ్‌సైట్ త్వరలో ప్రారంభిస్తాం. సూచనలను పార్లమెంటు సభ్యులు సమీక్షిస్తారు' అని ఆయన అన్నారు. ఈ కమిటీ సభ్యులు అన్ని రాష్ట్రాల్లోనూ పర్యటిస్తారు. రాష్ట్రాల అభిప్రాయాలను పరిగననణలోకి తీసుకుంటారు. మొదటగా మహారాష్ట్ర, ఆ తర్వాత మేలో ఉత్తరాఖండ్, జమ్మూ అండ్ కాశ్మీర్, పంజాబ్-హర్యానా జూన్‌లో పర్యటన ఉంటుంది అని ఆయన వెల్లడించారు.

### పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి విధించాలని కోరుతూ

## సుప్రీంకోర్టులో పిటిషన్




న్యూఢిల్లీ : ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందింది. దీంతో పశ్చిమబెంగాల్‌లో ముర్షిదాబాద్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ హింసలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన విధించాలని బిజెపి నేతలు పట్టుబడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టులో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. న్యాయవాది విష్ణు శంకర్ జైన్ సోమవారం ఈ విషయాన్ని న్యాయమూర్తులు బిఆర్ గవారు, అగస్టిన్ జార్జ్ లతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. పశ్చిమబెంగాల్‌లో పారామిలటరీ దళాలను మోహరించాల్సిన అవసరం ఉందని, దీనిపై తక్షణమే చర్య తీసుకోవాలని న్యాయవాది విష్ణు సుప్రీంకోర్టును కోరారు. దీనిపై సుప్రీంకోర్టు స్పందించింది. 'కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మాండమస్ రిట్ జారీ చేయాలని మీరు కోరుకుంటున్నారు. ప్రస్తుతం, మేము కార్యనిర్వాహక వ్యవస్థను ఆక్రమించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాము అని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ సందర్భంగా తమిళనాడు గర్నవర్ ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కి పెట్టిడంపై స్పందించి.. ఆ బిల్లులను సుప్రీంకోర్టు ఆమోదిస్తూ తీర్పునిచ్చింది. రాష్ట్రపతి, గవర్నర్ అధికారాలకు సంబంధించిన ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి పాలనపై వేసిన పిటిషన్‌ను విచారించేందుకు రేపు విచారణ జాబితాలో చేర్చడం జరిగింది.

# సన్నరకాల వరి.. తెలంగాణ సిరి



ప్రస్తుత యాసంగి (రబీ) సీజన్‌లో తెలంగాణలో సన్నరకాల వరిసాగు భారీ ఎత్తున విస్తరించింది. దాదాపు 40 లక్షల ఎకరాల్లో సాగు పూర్తయింది. గత యాసంగి సీజన్‌తో పోలిస్తే 15 లక్షల ఎకరాల వరకు పెరిగినట్టు చెప్పవచ్చు. దీన్ని బట్టి ఏ యాసంగి సీజన్‌లోనైనా ఇదేవిధంగా సన్నరకాల వరి భారీ ఎత్తున సాగవుతాయన్న సంకేతాలు సూచిస్తున్నాయి. ఈ విధమైన చెప్పుకోదగిన మార్పు రావడానికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ప్రోత్సాహకమే ప్రధాన కారణం. క్వింటాల్‌కు రూ. 500 వంతున ప్రభుత్వం ప్రోత్సాహకం కల్పించింది. మొదట ఖరీఫ్ సీజన్‌లో దీన్ని అమలు చేశారు. యాసంగి సీజన్‌లోనూ కొనసాగించారు. నేరుగా రైతు మిత్ర పథకంగా దీన్ని అమలు చేయడం వల్లనే సత్ఫలితాలు సమకూరాయి. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఈమేరకు తన విధానాన్ని మలచుకుంది. ఏటా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలంటే 24 లక్షల నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకాల బియ్యం అవసరమవుతుంది. ఈ వ్యూహం సేకరణ లక్షాలకు అనుగుణంగా ఉందని చెప్పవచ్చు. అయితే ఇందుకు సంబంధించి భాగస్వాములంతా సమానంగా ఆశావాదులు కాకపోవచ్చు. అయితే కొన్ని రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు ఒకే పంటపై అతిగా ఆధారపడడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. సమగ్ర పంటల వైవిధ్య వ్యూహం అవసరమని సూచిస్తున్నారు. తోటల పెంపకంతోసహా ప్రతి పంట రకానికి ఉన్న డిమాండ్ వివరిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా నేల స్వభావం, వాతావరణ పరిస్థితులపై సమగ్రమైన అధ్యయనాలు జరిగాయి. అయితే ఇప్పుడు కావలసినదంతా సమన్వయ ప్రణాళిక. ఆయా నేలలకు ఏ పంట అనుకూలంగా ఉంటుందో, ఎంతవరకు వాటికి నీటి సరఫరా అవుతుందో ఆలోచించవలసిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వరి.. నీటి లభ్యతపై ఆధారపడే పంట. రాష్ట్రం మొత్తం మీద 29 లక్షల వ్యవసాయ మోటార్లు పనిచేస్తున్నాయి. అదే సమయంలో భూగర్భ జలాలు తరిగిపోతుండడం కూడా దృష్టిలో పెట్టుకోవాలి. రైతుల దృష్టిలో రాయితీలు (బోనస్) స్వాగతించాల్సిందే. కానీ ఎంతకాలం ఇలా రాయితీలు కల్పించవలసి వస్తుందో అన్నది చర్చనీయాంశమవుతోంది. ఇప్పుడు దొడ్డురకం వరి కన్నా సాగవుతున్న సన్నరకాల వరి చాలావరకు లాభదాయకమేనని త్వరగా తెలుస్తోంది. ఎకరాల దిగుబడి వారీగా రాయితీలు సహాయం అందిస్తాయి. కానీ పంటకు తగిన నీటి సరఫరా అవుతుందా లేదా అన్నది ఆలోచించడం తప్పనిసరి. పంట లాభదాయకం కావాలంటే నీటి సౌకర్యమే కీలకం. స్థానిక నేల స్వభావం, వర్షపాతం, విత్తనాల రకం, ఎరువుల వినియోగం ఇవన్నీ పంట దిగుబడికి ఆధారమవుతాయి. 2023 నాటి యాసంగిలో 67,83,358 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. దీంతో పోలిస్తే 2024 లో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో నీరు సమృద్ధిగా ఉన్నందున వరిసాగుకు సానుకూలత ఏర్పడింది. గత ఏడాది 75.32 లక్షల ఎకరాల్లో యాసంగి పంటలను సాగు చేయించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. అందులో 40 లక్షల ఎకరాల మేరకు సన్నరకాల వరి విస్తీర్ణం నిర్ణయమైంది. ధాన్యం సేకరణలో కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలనే తెలంగాణ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని, రాష్ట్రంలోని అవసరాల దృష్ట్యా ఖరీఫ్ సీజన్‌లో దొడ్డు రకాల వరికి బదులు సన్నవరి ధాన్యం పండించాలని రైతులకు సూచించింది. ఆ మేరకు సన్నాలకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ప్రకటించడంతో అధికశాతం రైతులు సన్నవరి ధాన్యం సాగువైపే మొగ్గు చూపారు. వానాకాలంలో మొత్తం 66.77 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా, అందులో 40.44 లక్షల (61 శాతం) ఎకరాల్లో సన్నాలు సాగయ్యాయి. ఈ నేపథ్యంలో యాసంగిలో 54.83 లక్షల ఎకరాల వరిసాగు విస్తీర్ణానికి గాను, 40 లక్షల ఎకరాల్లో సన్నాలు సాగు కావడం గమనార్హం. 2023 వానాకాం సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం 33 రకాల సన్నధాన్యాలను ప్రకటించింది. తెలంగాణ సోనా, బిపిటి, హెచ్ఎంటి వంటి సన్నరకాలను పెద్ద ఎత్తు సాగు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను కోరడం ఫలితాలను అందించింది. ఇప్పుడు ప్రభుత్వం రేషన్ కార్డులపై సన్నబియ్యం సరఫరా చేస్తుండటం మంచి స్పందన వస్తోంది. ఇది వరకు రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం మాత్రమే ఇచ్చేవారు. లబ్ధిదారులు చాలా మంది దొడ్డు బియ్యం తీసుకోవడానికి వెనుకాడేవారు. చాలా వరకు ఈ దొడ్డు బియ్యం పక్కదారి పట్టేది. బహిరంగ మార్కెట్‌లో లబ్ధిదారులు సన్నబియ్యం కొనుగోలు చేయాలంటే అధిక ధర పలికేది. నెలకు సగటున ఒక కుటుంబానికి రూ.1000 నుంచి రూ.1200 వరకు బియ్యానికే ఖర్చు పెట్టవలసి వచ్చేది. ఇప్పుడు రేషన్ కార్డులపై సన్నబియ్యం ఇస్తుండటంతో ప్రతి వారూ దీన్ని తీసుకోడానికి ముందుకు వస్తున్నారు. ఇది వరకు రాష్ట్రంలో 80 లక్షల రేషన్ కార్డులు, 2.80 కోట్ల మంది లబ్ధిదారులు ఉండేవారు. అదనంగా కార్డులు లేని 30 లక్షల మందిని కలుపుకుని మొత్తం 3.10 కోట్ల మంది లబ్ధిదారులకు సన్నబియ్యం అందేలా ప్రభుత్వం చొరవ తీసుకుంది. అన్నయోజన పథకానికి కేంద్రం ఇచ్చే నిధులతో కలిపి బియ్యం పథకానికి రూ. 10,655 కోట్లు ఖర్చవుతుండగా, సన్నబియ్యం సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 2858 కోట్లు ఖర్చుచేయడం ఎంతైనా ముదావహం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మక పథకంగా ప్రజలను ఆకట్టుకుంటుందనడంలో అతిశయోక్తి లేదు.

# త్రిశంకు స్వర్గంలో ఇంటర్ విద్య




ప్రైవేటు రంగంలో ఇంటర్మీడియట్ బోధించే కళాశాలల సంఖ్య 1385 ఉన్నాయి. అంటే ప్రైవేటు రంగంలోనే జూనియర్ కళాశాలలు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఇక కార్పొరేట్ కళాశాలలు అయితే ఒక్కో పట్టణం లో పది జూనియర్ కళా శాలలు బ్రాంచీలు పెట్టి నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేవలం ఇంటర్మీడియట్ మాత్రమే బోధిస్తారు. ఇంటర్మీడియట్ బోధించే లెక్చరర్లు పిజి టీచర్లు ప్రభుత్వ రంగంలో 6,992 మంది ఉన్నారు. ఇంత మంది లెక్చరర్స్ ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు నానాటికీ తీసికట్టు నాగంబొట్టు అనే సామెత గా మారింది. పదవ తరగతి పరీక్షలు అవగానే ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రతినిధులు, మరో మాటలో చెప్పాలంటే ఏజెంట్లు తల్లిదండ్రుల వెంటపడి అడ్మిషన్ల తంతు పూర్తి చేసుకుంటున్నారు. కొన్ని కళాశాలలైతే వేసవి సెలవుల నిబంధనలు తుంగలో తొక్కి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నిరోధించాలసిన విద్యాశాఖ ఓ పత్రికా ప్రకటన జారీ చేసి కళ్ళు మూసుకుంటుంది. అటు ఉన్నత విద్య డిగ్రీకి, ఇటు ప్రాథమిక విద్యకు మధ్య ఇంటర్మీడియట్ విద్య అత్యంత కీలకమైన పునాది అంశం కావడంతో తల్లిదండ్రులు కాస్తా ఇంటర్‌పై ఆసక్తి చూపిస్తూ ఉంటారు. కనుక దానిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు కళాశాలలు యాజమాన్యం ఇంటర్ విద్య ను కీలకమైన వ్యాపారంగా స్వీకరించింది. ఒకప్పుడు ఇంటర్మీడియట్ విద్యకు ప్రభుత్వ కళాశాలలే కీలక అంశంగా ఉండేవి. ప్రభుత్వ కళాశాలలోనే చదువుతూ ఎంసెట్ కోచింగ్ కు సబ్జెక్టులవారీగా బయట తీసుకునేవారు. ప్రైవేటు కళాశాలలు కుప్పలుతెప్పలుగా వెలిసిన తర్వాత బోధన, కోచింగ్ ఒకే చోట లభించడంతో ప్రైవేటు కళాశాలలు వైపు విద్యార్థులు మరలుతున్నారు. కీలకమైన గణితం, సైన్స్ ప్రాధాన్యత ఉన్న ఇంటర్ గ్రూపుల కోసం ప్రైవేటు కళాశాలలు, కార్పొరేట్ కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. ఇక ఫీజులు కట్టలేని పేదలు మాత్రమే అరకొర ప్రభుత్వ కళాశాలలో చేరి కామర్స్, ఆర్ట్ లాంటి హెచ్ఇసి, సిఇసి లాంటి గ్రూపుల్లో చేరుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 6వ తరగతి నుండి ఇంటర్ వరకు ఉన్న గురుకుల పాఠశాలలు 500 వరకు ఉండగా, కేవలం ఇంటర్మీడియట్ బోధిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 469 మాత్రమే ఉన్నాయి. ఇక ప్రైవేటు రంగంలో ఇంటర్మీడియట్ బోధించే కళాశాలల సంఖ్య 1385 ఉన్నాయి. అంటే ప్రైవేటు రంగంలోనే జూనియర్ కళాశాలలు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఇక కార్పొరేట్ కళాశాలలు అయితే ఒక్కో పట్టణం లో పది జూనియర్ కళాశాలలు బ్రాంచీలు పెట్టి నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేవలం ఇంటర్మీడియట్ మాత్రమే బోధిస్తారు. ఇంటర్మీడియట్ బోధించే లెక్చరర్లు పిజి టీచర్లు ప్రభుత్వ రంగంలో 6,992 మంది ఉన్నారు. ఇంత మంది లెక్చరర్స్ ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు నానాటికీ తీసికట్టు నాగంబొట్టు అనే సామెత గా మారింది. జూనియర్ కళాశాల వ్యవస్థ పతనంలో చాలా కారణాలు ఉన్నాయి. ఇక్కడ బోధించే ఉపాధ్యాయులు తమ క్యాచ్‌మెంట్ ఏరియాలోని విద్యార్థులను తమ కళాశాలలో చేరమని కనీసం అడగరు. జూనియర్ కళాశాలల్లో సరైన మానెటరింగ్ ప్రక్రియ ఉండడం లేదు. జూనియర్ లెక్చరర్ల నియామకంలో కూడా పిజి అరకొర పూర్తి చేసిన బోధనేతర సిబ్బందిని ప్రమోషన్లపై లెక్చరర్లుగా నియమించడం కూడా ఒక రకంగా విద్యా ప్రమాణాల తరుగుదలకు కారణం అవుతున్నది. ఇప్పుడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధించే లెక్చరర్లు అన్ని సబ్జెక్టులకు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య మాత్రం అందుకనుగుణంగా లేదు. నూతన విద్యా విదానం 2020 ప్రకారం, విద్యాహక్కు చట్టం - 2009 ప్రకారం 2o3o3o4 ప్యాట్రన్ ప్రకారం 9, 10 తరగతుల్లో ఇంటర్ విద్యను పాఠశాలలోనే నిర్వహించవలసి ఉంది. కానీ, చట్టం వచ్చి 15 ఏళ్ళు అయినా ఆ ప్యాట్రన్ అమలు జరపడంలో ఇంకా ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇంటర్ కళాశాలల్లో బోధించే జూనియర్ లెక్చరర్స్ కూడా ఇంటర్మీడియట్ విద్యను పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇంటర్ విద్య పాఠశాలలో కొనసాగించడం వలన ప్రైవేటు కళాశాల వ్యవస్థ కొంతలో కొంతైనా దెబ్బ తింటుంది. సామాన్య ప్రజలకు ఇంటర్మీడియట్ చదువులో ఫీజులు భారం కూడా తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వాలు ఎంతసేపు ఉన్న వ్యవస్థలను డొలుపుకుపోయో ధోరణి తప్ప నూతన మార్పులు స్వీకరించే పరిస్థితి లేదు? ఇంకా ప్రైవేటు జూనియర్ కళాశాలలు, కార్పొరేట్ కళాశాలలు ఫీజులదందా మామూలు గా లేదు. ఒక్క 'డే' స్కాలర్‌కే లక్ష రూపాయలు ఫీజు వసూలు చేస్తున్నారు. ఇక రెసిడెన్షియల్ కళాశాలలోనైతే రెండు లక్షల నుండి మూడు లక్షలు దండుకుంటున్నారు. మొదట విద్యార్థుల చేర్చుకుని వరకు సౌమ్యంగా కనిపించిన యాజమాన్యం ఫీజులు వసూలు సమయానికి కఠినంగా మారుతున్నారు. సామాన్యుల ఆర్థిక స్థితిగతులు కూడా ఎంతమాత్రం పరిగణలోనికి తీసుకోకుండా వేధింపులకు గురిచేస్తారు. పిల్లలను కూడా మానసికంగా, భౌతికంగా చేసే వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. ప్రైవేటు కళాశాలలు ఎక్కువ మంది ఎంఎల్‌సిలు, ఎంఎల్ఏలు నడపడం వలన పరోక్షంగా ప్రభుత్వం మద్దతు కూడా వీరికి అన్యోపదేశంగా లభిస్తుంది. ఇకపోతే ఇప్పటికే ఇంటర్మీడియట్ అనుబంధంగా ఉన్న గురుకుల పాఠశాల అనుభవాలు తీసుకొని కొన్ని పాఠశాలల్లోనైనా ఇంటర్ అందుబాటులోకి వస్తే బాలికల డ్రాప్‌అవుట్స్ సంఖ్య, బాల్యవివాహాలు సంఖ్య కొంత వరకు తగ్గే అవకాశం ఉంది. ఇక పాఠశాల ఇంటర్ విద్యలో పాలిటెక్నిక్ విద్యను విలీనం చేయాల్సిన అవసరం ఉంది. లేబరేటరీ టెక్నీషియన్, నర్స్ శిక్షణ, పారిశ్రామిక శిక్షణ, కంప్యూటర్ విద్య, కృత్రిమ మేధ, ఫ్యాషన్ డిజైన్, అగ్రికల్చర్, సిరికల్చర్, హార్టికల్చర్ లాంటి వృత్తి విద్యా కోర్సులు చేర్చడం వలన బడుగుబలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం జరగడంతోపాటు ప్రభుత్వ పాఠశాల జూనియర్ కళాశాలలుకు ప్రాణప్రతిష్ట చేసినట్లు అవుతుంది. ఈ దశలో ఎంసెట్ లాంటి శిక్షణతో పాటు, లైంగిక విద్య, నైతిక విద్య సైతం బోధించడం ఇంటర్మీడియట్ స్థాయిలో సామాజిక అవసరంగా భావించాల్సి ఉంటుంది. అంతేకాక, ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థుల మాతృభాషను లాంగ్వేజ్‌గా తప్పనిసరిగా చేయాల్సిన అవసరం కూడా ఉంది. ప్రైవేటు కళాశాలలు వేసవి సెలవులులో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు, సంస్కృతం లాంటి లాంగ్వేజ్ సిలబస్ పూర్తి చేసుకొని ఇంకా సమయమంతా గణితం, సైన్స్ బోధనపై దృష్టి పెట్టడం వలన ప్రవేశ పరీక్షలలో రాణిస్తున్నారు. ఒత్తిడి లేని, స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్య ఒక్క ప్రభుత్వ రంగంలోనే లభిస్తుంది. కనుక కీలకమైన ఇంటర్మీడియట్ విద్యలో విద్యార్థిని తమ భవిష్యత్ లక్ష్యాల వైపు మళ్ళించే శాస్త్రీయ విద్య తప్పనిసరిగా అవసరం అవుతుంది. తాము ఇంటర్మీడియట్ స్థాయిలో నేర్చుకునే విద్య జీవితానుభవంలో ఉపయోగపడేది. తమ ఉపాధి అవకాశాలు కల్పించేదిగా, కనీసం పెంచేదిగా ఉండాలి. ఆ దిశగా ప్రభుత్వ ఆలోచనలు ఉండాలని, ఇంటర్ విద్యలో గౌరవప్రదమైన సంస్కరణలు రావాలని కోరుకుందాం. ఇంటర్ చదువుత్రిశంకు స్వర్గంలా కాకుండా విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే సంపూర్ణ అనుభవాలు, నైపుణ్యాలు నేర్పేదిగా, తీర్చిదిద్దేది గా ఆ మార్పులు ఉండాలని కోరుకుందాం

# ఆనందం కరువైన అభివృద్ధి



'ఆనందమె జీవిత మకరందం' అంటాడు సినీ కవి సముద్రాల. ఇంతకూ సదరు ఆనందానికి మూలకందం ఏది? అంతులేని సంపదలా? అఖండ జ్ఞాన విజ్ఞానాలా? శాంతి సామరస్యాలా? స్నేహమయ సామాజిక సంబంధాలా? జనచైతన్యమా? ప్రజానుకూల పాలనా విధానాలా? ఇటీవల విడుదలైన 'ప్రపంచ సంతోష నివేదిక' (2025) వీటన్నిటిని తనదైన శైలిలో విశ్లేషించి దేశాలకు ర్యాంకులిస్తుంది. వీటిల్లో కొన్ని మన కళ్ళు తెరిపిస్తాయి. కొన్ని నివ్వెర పరుస్తాయి. కొన్ని ఉసూరుమనిపిస్తాయి. ఈ నివేదిక ప్రపంచ దేశాల్ని మూడు గ్రూపులుగా విడదీస్తుంది. మొదటి 48 దేశాలు ఆనందంలో ముందున్నవి. వీటిలోనూ అగ్రభాగాన వున్న 20 దేశాల్లో 14 పారిశ్రామిక యూరపు దేశాలు. ఫిన్‌లాండుది ప్రథమ స్థానం. డెన్మార్కు, ఐస్లాండు నార్వే, స్వీడన్లవి తర్వాతి స్థానాలు. ఆశ్చర్యం ఏమంటే కోస్టారికా, మెక్సికోలకు మొదటి పది ర్యాంకుల్లో చోటు దక్కడం. ఎల్ సాల్వడార్, నికరాగువా, వియత్నాంలు మొదటి గ్రూపులోకి దూసుకురావడం. ఇక అమెరికా 11 స్థానాలు పోగొట్టుకొని 24వ స్థానానికి దిగజారిపోగా, బ్రిటన్ 2017 తర్వాత ఎప్పుడూ లేనట్టుగా 23వ స్థానంతో సరిపెట్టుకుంది! ఇజ్రాయిల్ 8వ స్థానంలో నిలిచి నివ్వెరపరిచింది. రెండో గ్రూపులోని 49 దేశాల్లో జపాన్, దక్షిణ కొరియా, మలేషియా, రష్యా, చైనా, వెనిజులాలున్నాయి. నేపాల్ 92వ స్థానంలో నిలిచి ఈ గ్రూపులో చోటుదక్కించుకోడం విశేషం. మూడవ గ్రూపులోని 51 దేశాల్లో భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ లు క్యూ గట్టగా ఆఫ్ఘనిస్తాన్ అట్టడుగుకు చేరింది. ఆశ్చర్యం ఏమంటే మానవాభివృద్ధిలో ఎదురులేని క్యూబా, సంపద (జిడిపి) స్థానే ఆనందాన్ని (జిహెచ్‌పి) అభివృద్ధికి గీటురాయిగా లెక్కించుకొనే భూటాన్‌తో సహా 48 దేశాలకు ఈ నివేదికలో చోటే చిక్కలేదు. వాటి డేటా అందుబాటులో లేదట! సహజంగానే తలసరి సంపద, ఆయుష్షు, స్వేచ్ఛ, శాంతి, అవినీతి రాహిత్యం, ప్రభుత్వాల మీద నమ్మకం, భవిష్యత్తు మీద భరోసా ఇవన్నీ సంతోషానికి తూకపురాళ్ళుగా ఈ నివేదిక తీసుకుంది. దీనికోసం ప్రపంచ బ్యాంకు సుస్థిరాభివృద్ధి గణాంకాలను వాడుకుంది. మరోవైపు "సంతోషం అంటే జీవితంలోని తృప్తే" అంటుందీ నివేదిక. స్నేహ హస్తమందించడం, కలిసి మెలిసి జీవించడం, స్నేహితులను సమకూర్చుకోడం, ప్రేమగా పలకరించుకోడం, ఇతరుల్ని నమ్మడం, జీవితాన్ని ప్రేమించడం, నిస్పృహకు లోనుగాకుండడం, పరస్పరం పంచుకోవడం, ఉమ్మడితనం లాంటివన్నీ సంతోష హేతువులుగా లెక్కిస్తుంది. సామాజిక జీవితానికి పెద్ద పీట వేస్తుంది. శరణార్థుల్ని ఆదుకోమంటుంది. మరీ చిన్న కుటుంబాల్లో సంతోషం వుండదంటుంది. ఇంట్లో నలుగురైదుగురుండే లాటిన్ అమెరికా దేశాల్ని సంతోష ధామాలంటుంది. కోవిడ్ తర్వాత మనుషుల్లో మంచి మార్పు వచ్చిదంటుంది. స్థిమితపడ్డాక మళ్ళీ వెనక్కి పోతున్నామన్న శంకనూ లేవనెత్తుతుంది. ఇలాంటి గీటురాళ్ళ కోసం "గాలప్ వరల్డ్ పోల్" డేటాను ప్రమాణంగా తీసుకుంటుంది. మన యువత ఒంటరిదై పోవడాన్ని అన్నిటికంటే ప్రధాన సమస్యగా ఈ నివేదిక పేర్కొంటుంది. మన యువకులు స్నేహం చేయడం మరిచిపోతున్నారట. సమాజానికి దూరంగా వుండిపోతున్నారట. వీరిలో నిస్పృహ పెరుగుతోందట. వ్యవస్థల పట్ల విశ్వాసం క్రమంగా సడలుతోందట. ఈ ధోరణి అమెరికాలోనూ, దక్షిణ కొరియాలోనూ మరీ తీవ్రంగా వుందట. ఇంత చెప్పిన "ప్రపంచ సంతోష నివేదిక" సైన్సూ, సంపద వున్నంత మాత్రాన సంతోషంగా వున్నట్టు చెప్పలేమంటోంది. పారిశ్రామికంగా, వైజ్ఞానికంగా ఎంతో ముందున్న అమెరికా, యూరపు దేశాలు సంతోషపరంగా వెనక్కి వెళుతున్నాయని హెచ్చరిస్తోంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయనీ అక్కడి లక్ష మరణాల్లో 23 ఆత్మహత్యలేననీ లెక్కేసి మరీ చెప్తోంది. ఈ దేశాల పురుషుల్లో, మధ్య వయస్కుల్లో నిస్పృహ, అభద్రతా పెరగడం ప్రమాదకరమంటోంది. ఇక్కడితో ఈ నివేదిక ఆగలేదు. పారిశ్రామిక దేశాల్లో వస్తున్న రాజకీయ మార్పుల్ని, ఓటింగు సరళిని కూడా ఇది సంతోషంతో ముడిబెట్టింది. అక్కడ శరణార్థుల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందట. ప్రపంచీకరణ అంటే ఏవగింపు వచ్చేసిందట. ఎన్నికల్లో సంప్రదాయ వ్యవస్థల పట్ల, పార్టీల పట్ల, సిద్ధాంతాల పట్ల నమ్మకం సడలిపోతోందట. కొత్త పార్టీలు వున్నట్టుండి పుట్టుకొస్తున్నాయట. తీవ్ర వామపక్షం వైపో, పచ్చి మితవాదం వైపో ఓటర్లు వొరిగిపోతున్నారట. బ్రెక్సిట్, ట్రంప్ విజయం, ఇటీవల జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్వీడన్, స్విట్జర్లాండ్, డెన్మార్కు, ఫిన్లాండుల్లో వచ్చిన రాజకీయ మార్పులు ఈ అభద్రత వల్లా, ఈ అపనమ్మకం వల్లా వచ్చినవేనట! ప్రపంచీకరణ, ఆటోమేషన్, వ్యాపారాల్లో అవినీతి సంప్రదాయ రాజకీయాల్ని కుదిపేస్తున్నాయట. జీవితంలో తృప్తి లేకపోవడమంటే ప్రజాస్వామ్యంలో నమ్మకం లేకపోవడమేనని ఈ నివేదిక విశ్లేషించడం పెద్ద హెచ్చరిక! ఈ ధోరణి ఒక సంస్కృతిగా మారడంతో ఇచ్చిపుచ్చుకోడాల్లో కూడా అభివృద్ధి చెందిన దేశాలు వెనకబడి పోతున్నాయనడం పెద్ద ప్రమాదసూచిక! ఈ రిపోర్టు కొన్ని "భయాల్ని" కూడా ముందుకు తెచ్చింది. సంప్రదాయ విలువలు నానాటికి పలచబడిపోవడం, వ్యవస్థల మీద నమ్మకం సడలిపోవడం, ప్రపంచీకరణను జనం ఈసడించుకోవడం, వర్గ పోరాటాలు విస్తరించడం ఇవన్నీ ఈ "భయాల" కిందికి వస్తాయి! రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కూడా ఇంకా ఈ ధోరణి ఏమిటని ఈ నివేదిక నిర్వేదపడుతుంది! బెర్లిన్ గోడ పతనమయ్యాక కూడా ఇలా జరగడమేమిటని దిగాలు పడిపోతుంది. మరీ అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఈ వాతావరణం కనిపించడమా అని హైరానా పడుతుంది. అదే సమయంలో ఇంకో కోణం నుంచి చూస్తే మానవ చరిత్రలో మనం ఎప్పుడూ ఎరగనంత సంపన్నులం. విద్యావంతులం. ప్రపంచ జ్ఞానం వున్నవాళ్లం. ఏడాదికి 500 డాలర్ల సాయం ఆపన్నులకు అందిస్తున్న వాళ్ళం. ఎంత సంతోషాన్నైనా సంపాదించుకోగల స్తోమత వున్నవాళ్లం. దీన్నీ మరిచిపోరాదంటుందీ నివేదిక. కానీ విచిత్రమేమంటే నలుగురు కూర్చుని భోంచేయడం, పోగొట్టుకున్న పర్సును తిరిగి తెచ్చివ్వడం లాంటి వాటిని కూడా సంతోష సూచికలో చేర్చిన "ప్రపంచ సంతోష నివేదిక" జాతులకు జాతుల్నే నిర్మూలన చేస్తున్న యుద్ధాల గురించి మాట్లాడదు. జాతి విద్వేషాల గురించి ప్రస్తావించదు. అసమానతల్ని పట్టించుకోదు. సకల మానవ విలువల్నీ హరిస్తున్న కార్పొరేట్ సంస్కృతిని గురించి పెదవి విప్పదు. నానాటికి హరించుకుపోతున్న ఉపాధి గురించి నోరెత్తదు. చివరగా చెప్పుకోవలసింది మన దేశం గురించి! భారతదేశం 128వ స్థానం నుంచి 11 స్థానాలు ఎగబాక గల్గింది. అయితే ఎంత విశ్వగురు స్థానంలో వున్నా నేపాల్, పాకిస్తాన్లతో సహా 117 దేశాల కంటే దిగువ స్థానంలోనే వుండిపోయింది! కాకుంటే శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్‌లు మనకంటే మరీ వెనుకబడి వున్నాయి. దీంతో తృప్తిపడి సరిపెట్టుకుందామా? కొంచెం లోతుగా ఆత్మావలోకనం చేసుకుందామా? కనీసం ఆ నిజాయితీ అయినా మనకుందా? ఇవీ ప్రశ్నలు!

## పోప్ మృతికి మోడీ సంతాపం



న్యూఢిల్లీ : పోప్ ఫ్రాన్సిస్ (88) కన్నుమూశారు. వాటికన్ సిటీలోని తన నివాసంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి భారత ప్రధాని మోడీ సంతాపం తెలిపారు. భారత ప్రజల పట్ల పోప్‌కి ఉన్న ప్రేమ ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని అని మోడీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. వారిద్దరూ కలిసి దిగిన ఫొటోలను మోడీ షేర్ చేశారు. 'పోప్ మరణం నాకు తీవ్ర బాధను కలిగించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాథలిక్ సమాజానికి నా హృదపూర్వక సంతాపం తెలియజేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది కరుణ, వినయం ఆధ్మాత్మిక ధైర్యం యొక్క దీపస్తంభంగా ఉన్న పోప్ ఫ్రాన్సిస్‌ను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారు. చిన్నప్పటి నుంచి ఆయన ప్రభువైన క్రీస్తు ఆదర్శాలను సాకారం చేసుకోవడానికి తనను తాను అంకితం చేసుకున్నారు. ఆయనతో కలిసి నేను కొన్ని సమావేశాల్లో పాల్గొన్నాను. సమ్మిళిత, సమగ్ర అభివృద్ధికి ఆయన నిబద్ధత నాకు ఎంతో ప్రేరణనిచ్చింది. భారత ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమ ఎల్లప్పుడూ గుర్తుండిపోతుంది' అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, ఇటలీలోని అపులియాలో జరిగిన జి7 శిఖరాగ్ర సమావేశానికి హాజరైన నరేంద్ర మోడీ.. పోప్ ఫ్రాన్సిస్‌ని కలిశారు. ఆ సందర్భంగా పోప్‌ని మోడీ హృదయపూర్వకంగా ఆలింగనం చేసుకున్నారు. వీరిద్దరూ కలిసి దిగిన ఫొటోలను మోడీ ఎక్స్‌లో షేర్ చేశారు.

## భాషా పోరాటం మాత్రమే కాదు.. జాతి పోరాటం కూడా : ఉదయనిధి స్టాలిన్



చెన్నై : కేంద్ర ప్రభుత్వం త్రిభాషా విద్యావిధానం పేరుతో తమిళనాడుపై హిందీని బలవంతంగా రుద్దుతోంది. ఈ విధానాన్ని ఆ రాష్ట్ర డిఎంకె ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తాజాగా తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ హిందీకి వ్యతిరేకంగా పోరాటం కేవలం భాషా పోరాటం మాత్రమే కాదు.. తమిళ సంస్కృతిని రక్షించడానికి కూడా ఒక జాతి పోరాటం. ఈ పోరాటం కొనసాగుతుంది అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, సోమవారం నందనం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి పేరిట 4.80 కోట్ల రూపాయలతో కొత్తగా నిర్మించిన ఆడిటోరియం ప్రారంభోత్సవ సభలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ 'పెరియార్, గ్రాండ్‌మాస్టర్ అన్నా, ముత్తమిళర్ కలైంజర్, ఇప్పటి మన ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సహా హిందీకి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు అని అన్నారు. 1986లో హిందీకి వ్యతిరేకంగా కరుణానిధి చేసిన ప్రసంగం ఇప్పటికీ సముచితంగానే ఉంటుందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. 1956లో హిందీ వ్యతిరేకంగా విద్యార్థుల చేసిన నిరసనలే తమిళ సంస్కృతిని కాపాడాయి. నీట్, ఎన్‌ఇపి, త్రిభాషా విధానాలకు సంబంధించి వాటి వెనుక ఉన్న వ్యూహాలను విద్యార్జులు అర్థం చేసుకోవాలని స్టాలిన్ కోరారు.

## పోప్ ఫ్రాన్సిస్ మృతిపై వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి



తాడేపల్లి : క్రైస్తవ మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్(88) కన్నుమూయడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా సంతాపం తెలిపారు వైఎస్ జగన్. 'పోప్ మృతి చాలా బాధాకరం. కాథలిక్ చర్చి సమాజానికి ప్రభావవంతమైన వ్యక్తి. ఆయన లాటిన్ అమెరికా నుండి వచ్చిన మొదటి పోప్. శాంతి, కరుణ కోసం ప్రపంచ వ్యాప్త గొంతుకగా నిలిచిన నిజమైన మానవతావాది. పోప్ ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని కోరుకుంటున్నా' అని వైఎస్ జగన్ సంతాపం వ్యక్తం చేశారు. కాగా క్రైస్తవ మతపెద్ద పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతి చెందారు. ఈస్టర్ సందర్భంగా నిన్న ఆయన పేరిట సందేశం వెలువడగా.. కొన్ని గంటలకే ఆయన మృతి చెందారని వీడియో సందేశం విడుదల చేయడం గమనార్హం. పోప్ ఫ్రాన్సిస్ అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో 1936 డిసెంబర్ 17న ఈయన జన్మించారు. 2013లో నాటి పోప్ బెనెడిక్ట్-16 రాజీనామా చేయడంతో ఫ్రాన్సిస్ కేథలిక్ చర్చి అధిపతి అయ్యారు. ఆ ఏడాది మార్చి 13న 266వ పోప్‌గా ఎన్నికయ్యారు. అమెరికా ఖండం నుంచి ఎన్నికైక తొలి పోప్‌గా ఈయనకంటూ ఓ గుర్తింపు ఉంది.


## అబిడ్స్ చౌరస్తాకు వస్తావా కేటీఆర్..? : ఈటల సవాల్



హైదరాబాద్: గత పదేళ్లలో తెలంగాణకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం చేసింది.. అదే తెలంగాణకు కేంద్రం చేసింది అనే దానిపై చర్చకు వస్తావా అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. అబిడ్స్ చౌరస్తాలో చర్చ పెట్టుకుందామా కేటీఆర్? అని ఈటల ప్రశ్నించారు. 'కాంగ్రెస్ నైజం దేశ వ్యాప్తంగా బట్టబయలైంది. మరొకవైపు కార్పోరేట్లరు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేయొద్దని బీఆర్‌ఎస్ అప్రజాస్వామిక పిలుపునిచ్చింది. హైదరాబాద్ ప్రశాంతంగా ఉండాలంటే బీజేపీకి ఓటు వేయాలి. కేంద్ర నిధులతోనే హైదరాబాద్ అభివృద్ధి. మజ్లీస్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ లు కుటుంబ పార్టీలు. ముఖ్యమంత్రి గత విదేశీ పర్యటనలోనే లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామన్నారు. లక్షల కోట్ల పెట్టుబడులు ఎక్కడ కనపడటలేవు. ఉన్న ఉద్యోగాలు ఇక్కడ ఊడిపోతున్నాయి. కేసీఆర్ హయంలోనే మానవ సంబంధాలు దెబ్బతిన్నాయి. అంతకుముందు ఒక ఎమ్మెల్యే ఇంటికి ఇంకో ఎమ్మెల్యే వెళ్ళేవారు. ఇప్పుడు అది లేదు' అని ఈటల విమర్శించారు..

# ఆయనకింకా ఆ క్రెడిట్ దక్కలేదు!

సింధూలోయ నాగరికతను
వెలుగులోకి తెచ్చిన రఖల్‌దాస్ బెనర్జీ
మొహెంజోదారోలో తవ్వకాలతో
బయటపడిన గొప్ప నగరం
బ్రిటిష్ పాలకుల కుట్రలతో
భారతీయుడికి దక్కని గుర్తింపు
ఘనత కొట్టేసిన బ్రిటిష్ జాతీయుడు
జాన్ మార్షల్




భారతదేశంలో 5,300 సంవత్సరాలకు పూర్వమే గొప్ప నాగరికత వర్ధిల్లింది. అదే సింధూలోయ నాగరికత లేదా హరప్పా నాగరికత. ప్రణాళికాబద్ధమైన వీధులు, ఇళ్లు, మురుగు నీటి వ్యవస్థతో ఈ నాగరికత ఇప్పటి ఆధునిక నగరాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉండేది. 1990వ దశకం తర్వాత బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో సింధూలోయ నాగరికత ఆనవాళ్లు బయటపడ్డాయి. భూమి పొరల కింద శతాబ్దాలుగా కప్పబడి ఉన్న శిథిలాలను వెలుగులోకి తీసుకొచ్చారు. అవిశ్రాంతమైన తవ్వకాలతో ఈ గొప్ప నాగరికతను నేటి తరానికి పరిచయం చేశారు. ఈ మహాయజ్ఞం వెనుక ఉన్నది ఎవరో తెలుసా? భారతీయుడైన రఖల్‌దాస్ బెనర్జీ. కానీ, మొత్తం క్రెడిట్ కొట్టేసింది మాత్రం అప్పటి భారత పురావస్తు సర్వే విభాగం(ఏఎస్ఐ) చీఫ్, బ్రిటిష్ జాతీయుడైన జాన్ మార్షల్. సింధూలోయ నాగరికతను బయటపెట్టింది జాన్ మార్షల్ అని బ్రిటిష్ ప్రభుత్వం లోకాన్ని నమ్మించింది. పాఠ్య పుస్తకాల్లోనూ అదే చేర్చారు. ఇప్పటికీ పిల్లలు అదే చదువుకుంటున్నారు. కానీ, వాస్తవం అది కాదని చరిత్రకారులు, పరిశోధకులు తేల్చిచెబుతున్నారు. అసలైన కథానాయకుడు రఖల్‌దాస్ బెనర్జీ అనామకంగా ఉండిపోవడానికి కారణం ఏమిటి? అసలు ఆయనెవరు? ఆ మహా మనిషిని మనం ఎందుకు మర్చిపోయాం?

### చిన్నప్పుడే చరిత్రపై ఆసక్తి

పురావస్తు పరిశోధకుడైన రఖల్‌దాస్ బెనర్జీ 1885లో పశ్చిమ బెంగాల్‌లో ఓ సంపన్న కుటుంబంలో జన్మించారు. బహరాంపూర్ పట్టణంలో పెరిగారు. ఆ మధ్య యుగాల నాటి కట్టడాలు అధికంగా ఉండేవి. ఆయన వాటిని చూస్తూ ప్రాచీన నాగరికతలు, చరిత్రపై ఆసక్తి పెంచుకున్నారు. కాలేజీలో చేరి చరిత్రను అధ్యయనం చేశారు. మధ్యయుగ భారతదేశ చరిత్రపై వ్యాసం రాసే బాధ్యత అప్పగించగా, అందుకోసం స్వయంగా పరిశోధన ప్రారంభించారు. పొరుగు రాష్ట్రం వెళ్లి అక్కడి శిల్పాలు, రాతపత్రులను పరిశీలించారు. దాంతో చరిత్ర, నాగరికతలపై ఆసక్తి మరింత పెరిగింది. 1910లో ఏఎస్ఐలో ఎక్సవేషన్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. చురుకైన వ్యక్తి కావడంతో తక్కువకాలంలోనే సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్టు స్థాయికి ఎదిగారు. 1917లో విధుల్లో భాగంగా పశ్చి మ భారతదేశానికి చేరుకున్నారు. 1919లో సింధూ ప్రాంతంలోని మొహెంజోదారోలో అడుగుపెట్టారు. ప్రస్తుతం ఈ ప్రాంతం పాకిస్తాన్‌తో లర్కానాలో జిల్లాలో ఉంది.

### ఇప్పటికైనా గుర్తింపు దక్కేనా?


సింధూలోయలో ప్రాచీన నగరాన్ని తవ్వకాల్లో బయటకు తెచ్చిన ఘనత నిశ్చయంగా రఖల్‌దాస్ బెనర్జీదే. అందుకోసం ఆయన ఎంతగానో కష్టపడ్డారు. వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకున్నారు. కానీ, ఒక భారతీయుడికి ఆ పేరు ప్రఖ్యాతలు దక్కడం బ్రిటిష్ ప్రభుత్వానికి ఇష్టం లేకపోయింది. ఆయనపై ఎన్నో అభియోగాలు మోపింది. అంతేకాకుండా రఖల్‌దాస్‌ది ధిక్కరించే తత్వం. తనపై ఎవరైనా పెత్తనం చెలాయించాలని చూస్తే సహించేవారు కాదు. ఈ లక్షణమే ఆయనను బ్రిటిష్ అధికారులకు విరోధిగా మార్చింది. నిధులు దుర్వినియోగం చేశారని, అవినీతికి పాల్పడ్డారని రఖల్‌దాస్‌పై నిందలు మోపారు. అరుదైన శిల్పాలు, పెయింటింగ్‌లు దొంగిలించారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో చోరీకి గురైన ఒక బుద్ధిస్టు దేవత విగ్రహం కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చారు. అవమానాలు భరించలేక ఆయన 1927లో ఏఎస్ఐలో ఉద్యోగానికి రాజీనామా చేశారు. కానీ, ఆయనపై వచ్చిన అభియోగాలను తర్వాత కోర్టులు కొట్టివేశాయి. ఉపాధి కోసం రఖల్‌దాస్ 1928లో బనారస్ హిందూ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1930లో మరణించారు. అప్పుడు ఆయన వయసు కేవలం 45 ఏళ్లు. గొప్ప చరిత్రను వెలికితీసిన రఖల్‌దాస్‌కు చివరకు చరిత్రలో స్థానం లేకుండాపోవడం ఒక వైచిత్రి. ఇప్పటి తరానికి ఆయనెవరో తెలియదు. సింధూలోయలో ప్రాచీన నగరాగన్ని సందర్శించేవారికి కూడా ఆయన గొప్పతనం ఏమిటో తెలిసే అవకాశం లేదు. ఇప్పటికైనా భారత ప్రభుత్వం స్పందించాలని, రఖల్‌దాస్ బెనర్జీకి తగిన గుర్తింపు ఇవ్వాలని చరిత్రకారులు కోరుతున్నారు.

### 5,300 ఏళ్ల నాటి నగరం

మొహెంజోదారో అంటే సింధీ భాషలో మృతిచెందిన మనిషి దిబ్బ అని అర్థం. ఇదే చోట రఖల్‌దాస్ బెనర్జీ తవ్వకాలు ప్రారంభించారు. తొలుత బౌద్ధ స్తూపాలు, నాణేలు, ముద్రలు, కుండలు, ఇతర కళాకృతులు లభించాయి. మరిన్ని ఆధారాల కోసం 1922, 1923లో తవ్వకాలు ఊపందుకున్నాయి. ప్రాచీన సింధూలోయ నాగరికత బయటపడింది. కాల్చిన ఇటుకలతో నిర్మించిన అప్పటి భవనాలు, నీటి తొట్టెలు, స్నానపు గదులు, రహదారులు వెలుగులోకి వచ్చాయి. ఇది 5,300 ఏళ్ల క్రితం నాటిదని తేల్చారు. సింధూనది లోయ 3.86 లక్షల చదరపు మైళ్ల మేర విస్తరించి ఉండేది. ఈశాన్య అఫ్గానిస్తాన్ నుంచి వాయువ్య భారత్ దాకా గొప్ప రాజ్యం వర్ధిల్లింది. తర్వాత ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వరదల కారణంగా చాలావరకు తుడిచిపెట్టుకుపోయింది.

# స్తుతి మర్దనం

'మర్దనం గుణవర్ధనం' అని మనకో నానుడి ఉంది. లోకంలో కొన్నింటిని ఎంతగా మర్దిస్తే, వాటి గుణాలు అంతగా వృద్ధిచెందుతాయని అర్థం. మర్దనానికి అచ్చతెలుగులో నలగగొట్టడం, పిసకడం, నూరడం అనే అర్థాలు ఉన్నాయి. చెరకుగడను, తాంబూలాన్ని, చందనాన్ని, పెరుగును ఎంతగా మర్దిస్తే, వాటి గుణాలు అంతగా ఇనుమడిస్తాయని ఈ నానుడికి మూలమైన సంస్కృత శ్లోకం చెబుతోంది. మర్దనకు అణచివేయడం, అంతమొందించడం అనే అర్థాలు కూడా ఉన్నట్లు పురాణ గాథలను గమనిస్తే అర్థమవుతుంది. ఉదాహరణకు 'కాళీయమర్దనం'లో బాలకృష్ణుడు కాళింది మడుగును విషభరితం చేసిన కాళీయ సర్పం పడగల మీదకెక్కి తాండవనృత్యం చేసి, కాళీయుడి పొగరును అణచేశాడు. కృష్ణుడిపై శ్లోకాలలో 'వసుదేవ సుతం దేవం కంసచాణూర మర్దనం' అనే సంబోధన ఉంటుంది. కృష్ణుడి మీదకు కంసుడు ఉసిగొలిపిన చాణూరుడు, ఆ తర్వాత కంసుడు కూడా కృష్ణుడి చేతిలో అంతమొందారు. లోకకంటకుడైన మహిషాసురుడిని సంహరించడం వలన దుర్గాదేవి మహిషాసురమర్దినిగా పేరుపొందింది. నిఘంటవులను శోధిస్తే 'మర్దన' పదానికి అనేక పర్యాయపదాలు, అనేక నానార్థాలు ఉన్నాయి. ఇవి ఎన్ని ఉన్నా, మర్దన అంటే నొప్పుల నుంచి ఉపశమనం కలిగించి, ఒంటికి హాయినిచ్చే దేహమర్దన అనే అర్థమే విస్తృతంగా వాడుకలో ఉంది. ఊరూరా వ్యాపిస్తున్న అధునాతన మర్దన కేంద్రాల పుణ్యాన మర్దన కళ ఇదివరకు ఎన్నడూ లేనంతగా వర్ధిల్లుతోంది. ఆయుర్వేదం సహా నానా సంప్రదాయ వైద్యపద్ధతుల్లో మర్దనకు ప్రత్యేక స్థానం ఉంది. తలనొప్పి, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, చర్మవ్యాధులు వంటి వాటికి మర్దనమే తగిన చికిత్స అని సంప్రదాయ వైద్యులు చెబుతారు. మర్దన చికిత్సలో రకరకాల తైలాలను ఉపయోగిస్తారు. మర్దన వల్ల శరీరానికి బడలిక తీరి, విశ్రాంతి కలుగుతుంది. శ్రమ వల్ల కలిగిన నొప్పులు తగ్గుముఖం పడతాయి. రక్త ప్రసరణ మెరుగవుతుంది. శరీరానికి ఉల్లాసం కలిగి, చక్కగా నిద్రపడుతుంది. క్రమం తప్పని మర్దన వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఆరోగ్యం మెరుగుపడుతుంది. మర్దన ఒక పురాతన శాస్త్రీయ కళ. ఆయుర్వేదాది సంప్రదాయ శాస్త్రాలు చెప్పేదంతా భౌతిక మర్దన పద్ధతుల గురించి మాత్రమే! లోకంలో మరో రకమైన మర్దన కళ కూడా విస్తృత వ్యాప్తిలో ఉంది. అయితే, అది అభౌతిక మైనది, ఇంకా నిర్గుణ నిరాకార పరబ్రహ్మ వలె అగోచరమైనది కూడా! భౌతిక మర్దనకు దేహ సౌఖ్యం, ఆరోగ్యం మాత్రమే పరమ ప్రయోజనాలైతే, అభౌతిక మర్దనకు అంతకు మించిన ఆధిభౌతిక ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. 'మహదానందానికి మీరు కేవలం ఒక మర్దనదూరంలో ఉన్నారు'



అనేది ఒక మర్దన కేంద్రం వ్యాపార నినాదం. మర్దన కలిగించే మహదానందం కోసమే మనుషులు అర్రులు చాస్తుంటారు. చాలామంది అందుకోసమే మర్దన కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించుకుంటూ ఉంటారు. భౌతిక మర్దనలో కించిత్ శారీరక శ్రమ ఉంటుంది గాని, అభౌతిక మర్దనలో అలాంటిదేమీఉండదు. ఊరకే నోటికి పనిచెప్పి, ఎదుటివారికి పరమానందం కలిగించే మాటలు అదను చూసి మాట్లాడితే చాలు%-% భౌతిక మర్దనకు మించిన ప్రయోజనాలు అనాయాసంగానే నెరవేరుతాయి. అభౌతిక మర్దనకు కీలక సాధనం పొగడ్త. పొగడ్త అగడ్త అని అంటారు. చాలామందికి ఈ సంగతి తెలిసినా, తెలిసి తెలిసి మరీ పొగడ్తలకు పడిపోతారు. పొగడ్త మనోమర్దన కళ. పొగడ్తలతో ఎదుటివారిని పడగొట్టడం ఒక కళ అయితే, పొగడ్తలకు పడిపోవడం ఒక బలహీనత. మనుషులన్నాక బలహీనతలు సహజం. మరి మనుషులన్నాక కొంత కళాపోషణ కూడా ఉండాలి కదా! అధికారంలో ఉన్న అత్యధికులకు పొగడ్తలు ఒక వ్యసనం. అధికారంలో ఉన్నవారిని పొగుడుతూ పబ్బం గడుపుకోవడం చాలామంది బతకనేర్పరులకు ఒక సత్కాలక్షేపం. అధికారంలో ఉన్నవారు చండశాసనులుగా ఎంతటి ప్రచండ ప్రఖ్యాతి పొందినా, 'ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి' అని ఎరిగిన ధీమంతులు అలాంటివారిని కూడా తమ వాగ్మర్దన కళతో ఇట్టే లోబరచుకుంటారు. కళలో రాణించాలంటే, నిరంతర సాధనతో నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నాడు వేమన. ఈ సూత్రం మర్దన కళకు కూడా వర్తిస్తుంది - అది దేహమర్దన కళ అయినా, మనోమర్దన కళ అయినా సరే! తగినంత సాధన, కావలసినంత నైపుణ్యం లేకుంటే, రసాభాస తప్పదు. అప్పుడు ఆశించిన ఫలితాలు దక్కకపోగా, పరిస్థితులు వికటించే ప్రమాదం కూడా తలెత్తవచ్చు. అలా వికటించే ప్రమాదాలు ఒక్కోసారి ప్రాణాంతకం కూడా కావచ్చు. చైనాలో ఇటీవల అలాంటి ప్రమాదమే ఒకటి జరిగింది. హునాన్ ప్రావిన్స్ రాజధాని చాంగ్షా నగరంలో ఐటీ ఉద్యోగం చేసే ఒక ఇరవయ్యారేళ్ల కుర్రాడు మెడనొప్పికి ఉపశమనం కోసం మర్దనకేంద్రాన్ని ఆశ్రయించాడు. అక్కడ మర్దనచేసే మహానుభావుడు ఎవరో గాని, దాదాపుగాగొంతు నులిమే స్థాయిలో మర్దన చేశాడు. ఆ మర్దనధాటికి అర్భకపు ఐటీ కుర్రాడు పక్షవాతంతో ఆస్పత్రి పాలయ్యాడు. మర్దన చేసేటప్పుడు మితిమీరిన ఒత్తిడి ప్రయోగించడం వల్ల అతడి మెడ లోని రక్తనాళాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వైద్యులు చెప్పారు. ఈ సంఘటనకు ముందు ఇలాగే మెడనొప్పికి మర్దన చేయించుకున్న థాయ్ గాయకుడు ఒకరు ఏకంగా పరలోకగతుడయ్యాడు. ఎలాంటి మర్దన అయినా, శ్రుతి మించితే, అది మరణశాసనం కూడా కాగలదు.

# నిస్సహాయతలో 'డబ్ల్యుహెచ్ఒ'




ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్ఒ)కు అమెరికా అకస్మాత్తుగా నిధులు ఆపేసింది. దీంతో ప్రపంచ దేశాలకు వైద్య సహాయం తీరని ప్రతిబంధకంగా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థలో సంస్కరణలు తీసుకొస్తే సమర్థత పెరుగుతుంది తప్ప ఈ విధంగా నిధుల కోత వల్ల అమెరికాకు కానీ, ప్రపంచ దేశాలకు కానీ ఎలాంటి ప్రయోజనాలు సిద్ధించవన్న అభిప్రాయాలు వైద్య నిపుణులనుంచి వస్తున్నాయి. దీని వల్ల ఔషధాలు, వ్యాక్సిన్ల తయారీ, సరఫరా, వ్యాధి గుర్తింపు సేవలు, ఆరోగ్యవ్యవస్థ నిర్వహణ, సాంకేతిక సహకారం ఇవన్నీ మూతపడతాయని, అనేక జీవితాలపై వ్యతిరేక ప్రభావం పడుతుందని బ్రౌన్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రొఫెసర్, వ్యాక్సిన్ అలియన్స్ గవి మాజీ సిఇఒ డాక్టర్ సేథ్ బెర్క్లీ తన ఆందోళన వెలిబుచ్చారు. గవి, వ్యాక్సిన్ అలయన్స్ అనేది ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్య కూటమి. ప్రపంచం లోని సగం మంది పిల్లలకు అత్యంత ప్రాణాంతక వ్యాధులనుండి టీకాలు వేయడంలో సహాయపడడం ఈ కూటమి ప్రధాన లక్ష్యం. 2000లో ఇది ప్రారంభమైనప్పటి నుండి ఒక తరానికి 822 మిలియన్లకు పైగా పిల్లలకు రోగ నిరోధక శక్తిని అందించడంలో, 14 మిలియన్లకు పైగా మరణాలను నివారించడంలో గవి సహాయపడింది. అలాగే 73 అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పిల్లల మరణాలను తగ్గించడంలో సహాయపడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలోని ప్రాజెక్టు వ్యాక్సిన్ సేఫ్టీ నెట్ (విఎస్ఎన్)లో గవి వెబ్‌సైట్ సభ్యత్వం కలిగి ఉంది. ఈ వెబ్‌సైట్ సెక్రటేరియట్ కార్యాచరణ బడ్జెట్ ద్వారా నిధులు సమకూరుస్తుంది. అమెరికా ప్రభుత్వం ఇంతవరకు ఈ గవీ కూటమి సంస్థకు 13 శాతం వరకు నిధులు సమకూరుస్తుంది. ఇప్పుడు ట్రంప్ నిధులు నిలిపివేతకు నిర్ణయం తీసుకోవడం ఇలాంటి వ్యాక్సిన్ సహాయ సంస్థలపై తీవ్ర ప్రభావం పడుతుందని డాక్టర్ బెర్క్లీ చెబుతున్నారు. ప్రపంచ దేశాల్లో మొత్తం 75 మిలియన్ పిల్లలకు వ్యాక్సిన్లు అందకుండాపోతుందని ఆయన అంచనాగా చెప్పారు. మలేరియా, మెనింజిటిస్ వ్యాధుల చికిత్సకు ఇప్పుడు కొత్త రకమైన వ్యాక్సిన్లు తయారయ్యాయి. మెనింజిటిస్ అనేది మెదడును, వెన్నుపామును కప్పిఉంచిన కణజాల పొరలు. ఈ కణజాల పొరలు మెదడును, వెన్నుపామును రక్షిస్తుంటాయి. ఈ పొరలచుట్టూ ద్రవం సంక్రమణ పుర్రెలో మంట, వాపునకు కారణమవుతుంది. సకాలంలో దీనికి చికిత్స చేయకుంటే ప్రాణాంతకమవుతుంది. ఇప్పుడు దీనికి వ్యాక్సిన్ కనుగొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిధులు ఆపేస్తే ఈ వ్యాక్సిన్లను సరఫరా చేయడం కుదరదు. ఆఫ్రికాలో మెనింజెటిస్ ఎక్కువగా వ్యాపిస్తోంది. అలాగే మలేరియా కూడా ఆఫ్రికాలో చిన్నపిల్లల ప్రాణాంతక వ్యాధిగా ప్రబలుతోంది. ఇప్పటివరకు ఆఫ్రికాలో మలేరియా మరణాలు 94% సంభవించాయి. ఈ విపత్తు సమయంలో మలేరియా, మెనింజెటిస్ వ్యాక్సిన్లను అందించగలిగితే కొన్ని లక్షల పిల్లల మరణాలను నివారించడానికి వీలవుతుంది. సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా మలేరియా వ్యాక్సిన్‌ను తయారు చేసింది. ఇతర దేశాల మలేరియా వ్యాక్సిన్ కన్నా సీరం వ్యాక్సిన్ 60% చవక. అంతేకాదు భారీ మొత్తంలో ఈ వ్యాక్సిన్‌ను తయారు చేయవచ్చు. ఇది గేమ్‌ఛేంజర్ కావడానికి వీలుంది. అయితే దీన్ని అందుబాటులోకి తీసుకు రావాలంటే తగిన ఆర్థిక సాయం అవసరం. కానీ ఈ ఆర్థిక సాయమే అమెరికా బెదిరింపులోపడింది. భారత దేశంలో ట్రాన్స్‌జెండర్లలో హెచ్ఐవి ప్రాబల్యం విపరీతంగా పెరుగుతోంది. జాతీయ సగటు 3.13 శాతంతో పోలిస్తే హైదరాబాద్‌లో హెచ్ఐవి ప్రాబల్యం 6.17 శాతం వరకు ఉంది. అందుకని దేశం మొత్తం మీద హైదరాబాద్‌లోనే ట్రాన్స్‌జెండర్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు అయింది. అమెరికా ప్రభుత్వం 'ప్రెసిడెంట్స్ ఎమర్జెన్సీ ప్లాన్ ఫర్ ఎయిడ్స్' పథకంకింద యుఎస్ ఎయిడ్ యాక్సిలరేట్ ప్రాజెక్టు ఆర్థికంగా, సాంకేతికంగా సహకరిస్తోంది. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (ఎన్ఎసిఒ) భాగస్వామ్యంతో 2030 నాటికి ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. కానీ అమెరికా నిధులు ఆపివేయడంతో ఈ లక్ష్యం ప్రశ్నార్థకమవుతుంది. ఇప్పటికిప్పుడు నిధులు సేకరణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం చాలా కష్టమని వైద్యనిపుణులు చెబుతున్నారు. దీనివల్ల హెచ్ఐవి చికిత్స ఆగిపోతుందని అంటున్నారు. ఈ చికిత్స సుదీర్ఘకాలం ఆపేస్తే మందులకు లొంగని వైరస్ శక్తి పెరుగుతుందని, అలాగే వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోతుందని, వైరల్ ప్రాబల్యం పెరిగిపోతుందని ఆందోళనచెందుతున్నారు. వాతావరణ మార్పులు అంటువ్యాధులపై తీవ్రప్రభావం చూపిస్తుంటాయి. అడవులను మనుషులు తమ స్వప్రయోజనాల కోసం ఆక్రమించడంతో వన్యమృగాలకు, కీటకాలకు నెలవు కరువై జనావాసాలకు చేరుకుంటున్నాయి. ఇప్పుడు జంతువులనుంచి కొత్త వైరస్ వ్యాధులు ఎక్కువగా సంక్రమించడం కొనసాగుతోంది. ఈ విధంగా కొత్త వ్యాధికారక బ్యాక్టీరియాలు 70% జంతువులనుంచే వ్యాపిస్తున్నాయి. ఈ వైరల్ వ్యాధులు చెలరేగిన సమయంలో ఎలాంటి వైద్యపరీక్షలు చేయకుండా యాంటీబయోటిక్స్‌ను విచ్చలవిడిగా వినియోగించడంతో యాంటీ మైక్రోబియల్ రిస్క్‌మరింత పెరుగుతుంది. అంటే బ్యాక్టీరియాకు లొంగని దారుణ పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల మరిన్ని వైరస్ వ్యాధులు వ్యాప్తి కావడానికి దారితీస్తుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ కొత్తరకం వైరస్‌ల గుర్తింపునకు, వాటి నివారణకు కొత్త వ్యాక్సిన్ల తయారీకి ప్రపంచ దేశాలు ఎక్కువగా వెచ్చించవలసి వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థను ఆర్థికంగా బలోపేతం చేస్తేనే వైద్యసహాయ కార్యక్రమాలు అన్ని దేశాలకు అందుతాయి. ఈ దూరదృష్టి లేకుండా అమెరికా ఏకపక్షంగా ప్రపంచ ఆరోగ్య సంస్థకు నిధులను ఆపేయడం వైద్యసంక్షోభానికి దారితీస్తుంది.